THE

# MANORAMA.

A Monthly Telugu Magazine

EDITED BY

Ch. L. Narasimham.

Vol. III. { RAJAHMUNDRY. JULY & AUGUST, 1908. } Nos. 7–8.

CONTENTS

| | | Page. |
|---|---|---|
| 1. | TIT-BITS. ... ... | 373. |
| 2. | WONDERS OF THE WORLD | 377. |
| 3. | LIFE OF GURU NANAK | 381 |
| 4. | BENJAMIN FRANKLIN ... ... | 393 & 405. |
| 5. | TANDALAM GOPALA RAO | 377. |

PRINTED AND PUBLISHED BY
CHILAKAMARTI LAKSHMINARASIMHAM
AT THE MANORAMA PRESS.
RAJAHMUNDRY.
1908.

పత్రికాధిపతి—చిలకమర్తి లక్ష్మీనరసింహము,

రాజమహేంద్రవరము.

## విషయసూచిక.


1. వినోదములు 373.
2. మహాద్భుతములు. 377.
3. నానకచరిత్ర. 381.
4. బెంజామిన్ ఫ్రాంక్లిన్. 393—405.
5. తండాళం గోపాలరావు 337.


# MANORAMA.


RATES OF SUBSCRIPTION (Including Postage).

| | | |
|---|---|---|
| For Patrons ... ... ... | Rs. | 25-0-0 |
| For Supporters ... ... | ,, | 12-0-0 |
| For one year (in advance) ... | ,, | 3-0-0 |
| Single Copy. ... ... ... | ,, | 0-4-6 |

చందానిర్ణయము. (అంచెకూలితో)

పోషకులకు సంవత్సరమునకు రు 25—0—0.

అభిమానులకు ,, రు 12—0—0.

సంవత్సరమునకు (ముందుగా చెల్లించిన) రు. 3—0—0. విడిప్రతి యొకటికి 0—4—6

ఈపత్రికను గోరువారు తత్పత్రికాధిపతిగారికి వ్రాసికొనవలయును.

శ్రీ

# మనోరమ.

ఇది మాసమున కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము. 3 | రాజమహేంద్రవరము. జూలై, ఆగష్టు 1908. | సంచికలు 7-8.

## వినోదములు

పరమశైవుఁడగు నొక రాజునుజూచి, తన పేదతనముఁ జెప్పుకొనవలయునని యొక సంస్కృతకవీశ్వరుఁడు రాజున్న పట్టణమునకుఁబోయి చిరకాలము ద్వారపాలకుల నాశ్రయించి లోనికిం బ్రవేశము పడయలేక భగ్నమనోరథుఁడై యచ్చటనె యుండెను. అట్లు కొంతకాల మచ్చట నుండగా నొకనాడు రాజు వేటకుఁ బోయెను. కవీశ్వరుఁడుఁగూడ నాయడవికిఁబోయి యొకసారి రాజుకంటఁబడెను. రాజు వానిం జూచి నీ వెవఁడవు యెక్కడనుండి వచ్చుచున్నాఁడ వని యడిగెను. కవి యిట్లనియె. "నేను బ్రాహ్మణుఁడను. కైలాసమునుండి వచ్చుచున్నాఁడను" అది విని రాజు "భక్తవత్సలుఁడగు శివుఁడు బాగున్నాఁడా యని యడిగెను. "శివుఁడు సిద్ధిపొంది నాఁ"డని కవి ప్రత్యుత్తరము చెప్పెను రాజు వానిపలుకులు విని 'అయ్యో, శివుఁడు పోయెనా ! పాప మతని దేహ మేమైనది. తలమీఁది గంగ యెం దరిగినది. చంద్రుఁ డేమైనాఁడు ? మేనఁ దాల్చిన పాములగతి యేమి ? అతని జ్ఞానము ప్రభుత్వము నెందుఁ బోయిన" వని యడిగెను. అతనిప్రశ్నల కుత్తరములగునట్లు కవి యీక్రింది శ్లోకమును జెప్పెను.

శ్లో॥ అర్ధం దానవవైరిణా గిరిజయాప్యర్ధం హరస్యాహృతం
దేవేర్ధందివి భూతలే పురహరాభావే సమున్మీలితే
గంగాసాగర మంబరంశశికళా నాగాధిపః క్ష్మాతలం
సర్వజ్ఞత్వ మధీశ్వరత్వ మగమత్వాం మాంతుభిక్షాటనం॥

తాత్పర్యము = శివునియొక్క దేహములో సగము విష్ణువు గ్రహించెను. తక్కిన సగము పార్వతి పుచ్చుకొనెను. గంగ సముద్రములో గలిసెను. చంద్రుఁడాకాశ మెక్కెను. పాములు భూమిలో దూరెను. ఆశివుని సర్వజ్ఞత్వము వాని యైశ్వర్యము నిన్నుఁ జేరెను. అయన ముష్టిచెంబు నాపాలఁబడినది. రాజా! ఈవిధముగా శివుఁడు తన వస్తువులు తలకొకటి యిచ్చిపోయెను." అది విని రాజు కవీశ్వరుఁడు తన పేదతనము నీవిధముగ గడుసుపోకడలచేఁ జెప్పెనని గ్రహించి వానికిం దగుబహుమాన మిచ్చి పంపెను.

---

ఒక బ్రాహ్మణుఁడు తన కిరువదియేండ్లువయసున్నప్పుడు మూడేండ్లపిల్లను పెండ్లియాడి విద్యాభ్యాసము నిమిత్తము కటకమునకుఁబోయి యక్కడ పండ్రెండు సంవత్సరములు వ్యాకరణశాస్త్రము జదివి యది ముగిసినతోడనే గృహమునకు రాక తర్కశాస్త్రముఁ జదువ నారంభించెను. ఆతనియొక్క భార్య యుక్తవయస్కురాలై పదునాఱుసంవత్సరముల ప్రాయముగలదై చిన్ననాటినుండియు గొప్పపండితుఁడగు తండ్రివద్ద సంస్కృతాంధ్రములను జదువుకొని మంచి సాహిత్యముగలదై రసవంతముగఁ గవిత్వముఁ జెప్పనేర్చి వ్యాకరణశాస్త్రము ముగించినతోడనే భర్త వచ్చునని సంతోషపడుచుండెను. అంతలో నతఁడు తర్కశాస్త్రము ప్రారంభించినాఁడని విని యామె మిక్కిలి వగచి యీక్రింది శ్లోకమును వ్రాసి కాశీ వెళ్లుచున్న తనయూరి బ్రాహ్మణునిచే భర్తకంపెను.

శ్లో॥ గృహేహిత్వాబాలా మభినవ విలాసైకలలితాం
అధీతే భిక్షాసీ చిరమధిశయానక్షితితలే
పరిజ్ఞాతే శాస్త్రే కటకమటతో జీర్యతివపుః
చకోరేపాండిత్యం నవిషయసుఖం నాపిచతపః॥

తాత్పర్యము = నవయౌవనము కలిగిన పడుచుదానిని నన్నింటవిడిచి నేల పండుకొని మాధుకరమెత్తి తిని నీవు చదువుకొనుచున్నావు. కటకములో శాస్త్రము లన్నియు మీరు చదువునప్పటికి శరీరము కృశించి వార్ధకము లోఁబడును ఓమూర్ఖుడ నీపాండిత్యమెందుకు? ఇది యిహలోకసుఖము నైనదిగాదు తపము నైనదిగాదు. అనగా సంసారముమీఁద వాంఛ లేనియెడల నీచదువు మాని తపస్సు చేసికొనుము. దానివలన మోక్షమైనఁ గలుగును. లేదా గృహస్థుఁడవై భోగింపఁదలఁతువా యా బండచదువు మాని సంసారివి గమ్ము. అంతియెగాని రెంటికిఁ జెడవద్దని భావము.

---

ఒకకవీశ్వరుఁడు రసికతయెట్టిదో యెఱుఁగని యొకమూర్ఖరాజువద్దకుఁబోయి చిరకాలము వాని నాశ్రయించి రసవంతములగు శ్లోకము లనేకములు వాని కంకితములుజేసి చెప్పెను. ఆరాజెంతమందబుద్ధియో గాని యతిరసవంతములగు నాశ్లోకములలో నొకదానికైన నతఁడు సంతసింపలేదు. కవిని మెచ్చలేదు. బహుమాన మీయలేదు. ఎట్టకేలకు కవీశ్వరుఁడు ప్రాణము విసికి తన యదృష్టమును నిందించుకొని బ్రహ్మదేవుని గూర్చి యీక్రింది శ్లోకము చెప్పెను.

శ్లో॥ ఇతరదుఃఖశతాని లిఖస్వమే। వితరతాని సహే చతురానన।
అరసికాయ కవిత్వ నివేదనం। శిరసిమాలిఖ మాలిఖ మాలిఖ॥

తాత్పర్యము = ఓ బ్రహ్మదేవుఁడా! నా మొగముమీఁద నీ వెన్నివందల యితరదుఃఖములను వ్రాసినను సరే యవి యన్నిటిని సహించెదను కాని రసికత యెఱుఁగని మోటపశువువద్దమాత్రము కవిత్వముఁ జెప్పుకొమ్మని నా లలాటముమీఁద నెన్ని జన్మములకైనను వ్రాయకుము. వ్రాయకుము. వ్రాయకుము.

---

ఒకరాజకుమారుఁడు మఱియొకరాజపుత్రికను వలచి తన్ను వివాహమాడుమని ప్రార్థించుచు నామెవద్దకు కొందఱిని స్త్రీలను బురుషులను రాయబార మంపెను. రాయబారము నిమిత్తము పోయిన స్త్రీలుఁ బురుషులుఁగూడ నారాజకన్యక చక్కఁదనమును జూచుచు నామె మధురోక్తరచనములచేత నానందము నొందుచు బంపినవారివద్దకు తిరిగి రారైరఁట. అప్పుడా రాజకుమారుఁడు తనమనస్సునే యామెవద్దకు రాయబారము నిమిత్త మంపిన నదియును దిరిగి రాలేదఁట. అప్పుడతఁ డీక్రింద సంస్కృతశ్లోకమును జెప్పెను.

శ్లో॥ నపుంసక మితిజ్ఞాత్వా ప్రియాయై ప్రేషితం మనః।
తత్తుతత్రైవ రమతే। హతాః పాణినినావయం॥

తాత్పర్యము = పాణిని యను మహాత్ముఁడు సంస్కృతమునందు వ్యాకరణశాస్త్రమును జేసెను. అతఁడు శబ్దములకు లింగవిభాగము చేయునప్పుడు మనశ్శబ్దము నపుంసకలింగమని చెప్పెను. ఈశ్లోకమును జెప్పిన రాజకుమారుఁడు ప్రియురాలివద్దకు తా నదివఱకు రాయబారము పంపిన స్త్రీలు స్త్రీలింగములోఁ జేరినవారై పురుషులు పుంలింగములోఁ జేరినవారై ప్రాణములు కలవారగుటచే సొగసులాఁడియైన యాసుందరిని విడిచి రాలేకపోయిరి గనుక నపుంసకలింగమైన మనశ్శబ్దమునకు ప్రాణముండదు గదా యని వ్యాకరణశాస్త్రవేత్తయగు పాణిని మాటలు నమ్మి ప్రియురాలివద్దకు మన

స్సుపంపెను. అదికూడ తక్కిన స్త్రీపురుషులవలెనే తిరిగి రాకపోవుటచేత నాతఁడీ విధముగ విలపించుచున్నాఁడు) “ మనశ్శబ్దము నపుంసకలింగ మగుకాని ప్రియురాలి వద్దకు పంపుకొంటిని. అదియు నచ్చటనే కూర్చుండి తిరిగి రాదు. అయ్యో! పాణిని నాకొంప తీసినాఁడు”.

---

ఒకకవి మహాత్ముఁడగు కాళిదాసునిగూర్చి యీక్రింది చిత్రశ్లోకమును జెప్పెను.

శ్లో॥ పురాకవీనాంగణనాప్రసంగే । కనిష్ఠికాధిష్ఠితకాళిదాసః
అద్యాపితత్తుల్యకవేరభావా । దనామికాసార్థవతీబభూవా॥

మనుష్యుని చేతియ్రేళ్లయిదింటిలోఁ జిటికెనవ్రేలునకుఁ గనిష్ఠికయని పేరు. దాని తరువాతివ్రేలున కనామిక యని పేరు. ఏవస్తువులయిన మనము లెక్కించున ప్పుడు, ఎడమచేతివ్రేళ్లుచాపి కుడిచేతి చూపుడువ్రేలితో, ఒకటియని యెడమచేతి చిటికెనవ్రేలు మడచి 'రెండు' అని దానితరువాతివ్రేలు మడచి క్రమముగా లెక్క పెట్టుదురు.

శ్లోకతాత్పర్యము = పూర్వకాలమందు కవులను లెక్కపెట్టవలసి వచ్చినప్పుడు మనుష్యులు కాళిదాసుపేరు మొదట చెప్పి చిటికెనవ్రేలు (కనిష్ఠిక) ను మడచుచు వచ్చిరి. అది మొదలుకొని నేటివఱకు కాళిదాసుతో సమానుఁడైన కవీశ్వరుఁడు రెండ వవాఁడు లేకపోవుటచేఁ జిటికెనవ్రేలి తరువాతనున్న యనామికను మడిచి లెక్కచె ప్పుటకు కవి దొరకలేదు. ఆవ్రేలునకు నామముఁ డెవ్వఁడు దొరకలేదు గావుననే యనామికయను పేరు సార్థకమైనదఁట. లేకపోయిన నావ్రేలున కనామికయను పేరేల గలుగవలయు.

---

ఒకరాజు తనయాస్థానకవీశ్వరుల నందఱబిలిచి ప్రపంచమునందు కృతజ్ఞతగల వారిలో నగ్రగణ్యు లెవ్వరని యడిగెను. అందొకకవి రాజున కుత్తరముగా నీక్రింది శ్లోకముఁ జదివెను.

శ్లో॥ ప్రథమవయసిపీతం తోయమల్పం స్మరంతః
శిరసినిహితభారాః నారికేళానరాణాం
సలిల మమృతకల్పం దుద్యురాజీవితాంతం
నహికృతముపకారం సాధవోవిస్మరంతి॥

తాత్పర్యము = కొబ్బరిచెట్లు తమచిన్నప్పుడు మనుష్యులు తమకుఁ బోసిపెంచిన కొంచెమునీరును జ్ఞాపకముంచుకొని విశ్వాసముగలవై తాము పెద్దవైనతరువాత తలల మీంద నెంతోబరువుపెట్టుకొని యమృతమువంటినీరు ఆజన్మాంతము మనుష్యుల కిచ్చు చుండును. మంచివారు చేసిన యుపకారము కొంచెమైనను మరువరుగదా:



## 10 అగ్నిపర్వతము.


పర్వతములు రెండువిధములు. అగ్నిపర్వతములు సామాన్యపర్వతములు. సామాన్య పర్వతములంగూర్చి మనమిక్కడ చర్చింప నవసరములేదు. అగ్నిపర్వతములు పైకి తక్కినపర్వతములవలెనే యుండును. కాని వానియుదరమునందు దారుణమైన యగ్ని యుండును. ఈపర్వతము లప్పుడప్పుడు పగిలి లోపలనుండి పొగ రాళ్లు లావాయను ద్రవపదార్థము మొదలగు వస్తువులం గ్రక్కి చుట్టుపట్లనున్న ప్రదేశముల నాశనము చేయును. కొన్నిదేశములలో నీపర్వతము లొక్కొక్కటిగాఁ గానఁబడుచుండును. కాని తరుచుగ నివి బారులు కట్టియేయుండును. ఉత్తరపు టమెరికాలోనున్న యాండీసు పర్వతశ్రేణి యగ్నిగర్భమే. ఈయగ్నిపర్వతములు మరల రెండువిధములు. దారుణపర్వతములు. శాంతపర్వతములు. శాంతపర్వతములనగాఁ గొంతకాలము దారుణముగా నుండి యప్పుడప్పు డుద్గారము నొంది లావా మొదలగు పదార్థములను గ్రక్కి యిప్పుడు వట్టికొండలై పనిచేయకుండినవి. దారుణపర్వతములనగా నిప్పటికి నప్పుడప్పుడు పగిలి

సమీపభూమిని భస్మపటలముచే యునవి. ప్రపంచమునం దిప్పుడీపర్వతము లెన్ని యున్నవో చెప్పుట చాలకష్టము. అయినను ప్రకృతిశాస్త్రజ్ఞులు వేసిన లెక్కలచే నిప్పుడీపర్వతము లాఱువందల డెబ్బదిరెండున్నవి. అందులో రెండువందల యేబది యైదు దారుణపర్వతములు. అందు పదునొకండు యూరపుఖండములోని యైస్లాండు దీవియందును. తొంబదిమూడు ఆసియాఖండమునందును యిరువదియాఱు, ఆఫ్రికాఖండమునందును, ఉత్తరమెరికాయందు నలువదియాఱు పర్వతములును యిరువదియేడు మధ్యయమెరికాలోను ముప్పదియొకటి దక్షిణయమెరికాయందును ఏడు ఆస్ట్రేలియాలోను యిరువదినాలుగు సముద్రమధ్యమందున్న యితరదీపములయందును గానఁబడు చున్నవి.

అగ్నిపర్వత మేమియుండునో కన్నులతో నిదివఱ కెన్నఁడు చూడనివారు దాని ప్రతిమంజూచి యాకారము గ్రహింపవచ్చును. ఈపర్వతములలోఁ గొన్ని మిక్కిలి యున్నతమైనవి కొన్ని చిన్నవి. అగ్నిపర్వతమునకు సిరస్సున నొకకన్నముండును. ఆకన్నమే ద్వారము. అక్కడనుండి కొండయొక్క యడుగుభాగమువఱకు గొప్పసొరంగముండును. ఈసొరంగముప్రక్కనే దానివంటి సొరంగ మొకటి సాధారణముగ నుండును. ఈసొరంగముల చుట్టు తూట్లుపడినట్లు చిన్నచిన్న రంధ్రములుండును. కొన్ని యగ్నిపర్వతములకు సిఖరములమీఁద సొరంగములుండవు. అట్టిపర్వతములు పగిలినప్పుడు దానియం దక్కడక్కడగల నెరియలలో నుండి లావా మొదలగునవి ప్రవహించును. శాంతపర్వతములయందును దారుణపర్వతములు శాంతస్థితిలో నున్నప్పుడును మీఁదిసొరంగములు పూడియుండును. కొండపగిలినప్పు డాసొరంగములలో నున్న కఠినపదార్థమంతయుఁ గరగిపోయి సొరంగము బయలుపడును.

అగ్నిపర్వతములు పగులునప్పుడు చుట్టుప్రక్కలనున్న జనులకు ముందుగాఁ గొన్ని సూచనలు గనఁబడును. పర్వతగర్భమందు ఉఱుముని యొకవిధమైన ధ్వని వినఁబడును. అనంతరము సొరంగమునుండి వర్షించుటకు మేలులేనంత భయంకరముగా పెద్దరాళ్లు గలని బూడిదె యాకాశమునిండి కొన్నాళ్ళు ఆరాళ్లు బూడిదయును గ్రమక్రమముగా క్రిందపడి చుట్టుప్రక్కల ప్రదేశమును పర్వతమంత యెత్తుచేయును. ఈధుమ్ముచేతఁ బొగచేత నొకప్పుడు సూర్యమండలము కాంతికూడ విచిత్రముగా నగును. 1882 వ సంవత్సరమున జావాద్వీపము నందొక యగ్నిపర్వతము పగులగా నప్పుడు వెడల్లిన పొగచేతను

జమ్ము చేతను సూర్యమండలముయొక్క తేజస్సు కొన్నినాళ్లు మందమై కొంచెము నీలవర్ణముగాఁ గనఁబడెను. ఈశిలాధూళివర్షములు కొంచెము తగ్గినతోడనే సారంగములనుండి లావాయును సద్రావకము జగద్భయంకరముగా బయలుదేరెను. దానినోడి లుబ్ధిబ్ధయని చెప్పుటకు వీలులేదు. సారంగముమండి యిట బయలుదేరునపు డావిరివలె తెల్లగానుండును. వర్షకాలములో గొప్పనదులకు వచ్చు వరదవలె యిది యాసారంగము నుండి బయలుదేరి క్రిందికి బ్రవహించి సమీపభూములలో నడ్డమువచ్చిన పొలములను వృక్షములను గృహములను గ్రామములను జంతువులను మనుష్యులను బూడ్చివేయును.



11 లావాప్రవాహము.

పూర్వకాలమునం దిటలీదేశమున పాంపెయను మహాపట్టణమొకటి యగ్నిపర్వతోద్గారమువల్ల కలిగిన లావాప్రవాహముచేత గప్పఁబడెను. ఈలావాభూమిమీఁదఁ బడిన స్వల్పకాలములోనే చల్లారి గట్టిపడి యదియొక చిన్నపర్వతమై పోవును. అట్లు చల్లబడిన కొద్దికాలములోనే మనుష్యులు దానిమీఁద నిలిచియుండవచ్చును. చల్లబడకమునుపు దానిలో నొకకఱ్ఱబెట్టితిమా యది తత్క్షణమే కాలిపోవును. లావాప్రవాహము లొక్కొక్కప్పుడు మిక్కిలి పొడవుగా నిడివిగానుండును. 1783వ సంవత్సరమందు యూరపుఖండములోనున్న ఐస్లాండు దీవిలో నొక యగ్నిపర్వతము పగిలెను. అప్పుడు లావా రెండు సారంగములనుండి వెడలెను. ఒకప్రవాహము నలువది మైళ్ల

పొడవై రెండువది నలువదియైదు మైళ్లపొడవై యుండెను. ఆప్రవాహము కొన్నితావుల నేడు మైళ్లు కొన్నితావుల పండ్రెండు మైళ్లు కొన్ని తావుల పదునైదు మైళ్లు వెడల్పు గలిగి యుండెను దాని యెత్తు రమారమి యాఱు వందల యడుగులుండెను ఇది యగ్ని రసమని చెప్పవచ్చును. దాని మీఁదనుండు గాలియే మండువేసఁగిలో వచ్చుగాడ్పుల కంటె వెచ్చగానుండును.

భూకంపములకు నగ్నిపర్వతోద్గారములకుఁ గారణము లించుమించుగ సమానము లేయని కొందఱు తత్త్వశాస్త్రజ్ఞు లూహించుచున్నారు. భూగర్భ ముపరిభాగముకంటె వేడిగానుండును. నేలత్రవ్విన కొలఁది యుష్ణమై యుండును. భూమి రెండు మైళ్లు త్రవ్వితిమా యచటి నీరు మిక్కిలి మఱిగిన నీరువలె వేడిగా నుండును. ముప్పది మైళ్లు త్రవ్వితిమా యినుము మొదలగు లోహములు కరిగి పోవునంతటి దారుణమగు యుష్ణమక్కడ నుండును. ఆవేడిచేత నప్పుడు పర్వతములు పగిలి లోపలనున్న సమస్త వస్తువులు గరగి లావారూపమున బ్రవహించును. కొన్నితావుల యందు భూమిలో రెండుమైళ్లలోనుండి వేడినీరు పైకూరుచుండును. వాటినే మనవా రుష్ణకుండములనుచుందురు భూగర్భమునందు వేడియే లేనిపక్షమున లోపలనుండి కాగిననీరు బైటికి వచ్చుటకుఁ గారణమేమి? కాఁబట్టి భూమి కడుపులో నపారములైన యుష్ణవాయువు లుష్ణద్రావకము లుండవలయు. భద్రాచలమువద్దనొకచోట నుష్ణకుండములున్నవి ప్రకృతిశాస్త్రవైచిత్ర్యము తెలియఁగని మనవారు వాటిని జూచి విస్మితులై పూర్వము సీతాదేవి యరణ్యవాసము చేయునపుడు చన్నీళ్ల స్నానము చేయలేకపోగా భర్తయగు రాముఁడు సుకుమారి యగు భార్యనిమిత్తము వేడినీరు భూమిలోనుండి తెప్పించెనని చెప్పుకొనుచుందురు. కొన్ని యగ్నిపర్వతములు పగులునప్పుడు వాటిచప్పుడు కొన్ని వందల మైళ్లవఱకు వినఁబడుచుండును.

మర్ధనుఁడు తన యుదరపోషణార్థము గానవిద్య నేర్చికొన్నవాఁడయ్యు గురునానకు తోఁ గొన్నినాళ్లు సహవాసము చేయు నప్పటికి వానికి స్వలాభపరాయణత్వ మైహిక విషయాసక్తి దప్పిపోయెను. పారమార్థిక చింత ప్రబలెను. తనవలెనే పుత్రుఁడు సంసారతంత్రములో దగుల్కొనునట్లు చేయవలయునని ప్రయత్నించుచున్న కాళుని చేష్ట లయందతని కేవ గలిగెను. దయాళువు లోకబాంధవుఁడు నగు భగవంతుఁ డొకఁ డున్నవాఁడనియు వాని సేవయే మానవునకుఁ బ్రథమకృత్యమనియు నతఁడు తెలిసి కొనెను. తెలిసికొని తన్ను పంపిన యజమానికంటె మర్ధనుఁడు జ్ఞానియయ్యెః నానకు యొక్క నిశ్చలభక్తిని శాంతమును మనోధైర్యమును భూతదయను జూచినవారందరదివఱకు కొంతభక్తిహీనులైనను తప్పక భక్తితత్పరు లగుదురు. అందుచేతనే మర్ధనుడు స్వలాభాన్వేషి గాక నానకునకు శిష్యుడయ్యెను. పుత్రుడు చెడిపోయినాడని దుఃఖితుడైన కాళుని మర్ధను డూరడించి గుణరత్నాకరుడగు నట్టి కుమారుడు గర్భమున జనించినందున దన్ను ధన్యుఁడుగా భావించుకొనక విచారించుట యవివేకమనియు వానికుమారుడు లోకసామాన్యుడు కాడనియు శ్రీకృష్ణుని యవతారమనియు సూర్యచంద్రుల వంశమున బుట్టెననియు మఱియు బెక్కుభంగుల దన భక్తికొలది చెప్పి వాని పీడ్కొని మొదటినుండియు నానకునందు మంచియభిప్రాయము గలిగియుండిన రాయబులారు వద్దకుబోయి నానకు వృత్తాంతమంతయు వాని కెఱిగించెను. రాయబులారు నానకు వృత్తాంతమును గాళుడు విన్నట్లు వినక మున్న తా ననుకొన్నదానికి నాడు విన్నదానికి సరిపోయెనని చాలసంతసించి తాల్వెండీగ్రామమునకు గురునానకు నొకసారి బంపుమని మర్ధనుని వేడుకొని తనమాటలుగా వానికి విన్నవింపుమని కొన్నిపలుకులు చెప్పి పుచ్చెను. మర్ధనుఁడు తనవెంట నీసారి బలునిదోడ్కొని పయనమై యమ్నాబాదునకు బోయెను.

పోయి నానకుని గాంచి యతడు రాయబులారు మాటలుగా నిట్లని విన్నవించెను "నేను చాలకాలమునుండి మహాత్ములగు మిమ్ము జూడగోరుచుంటిని. కాని వార్ధకము దేహదౌర్బల్యము నా రాక కాటంకములు గలిగించినవి. పయనమేడుదినములు పట్టుట చేతను బాధలు మిక్కిలి పడవలసివచ్చుటచేతను రాజాలనైతిని. కావున నాయెముకలు గోతిలో బడకమున్నె మీరే తాల్వెండీగ్రామ మొక్కసారి వచ్చి నాకు దరిశనమిచ్చి నన్ను ధన్యుని జేయవలయునని కోరుచున్నాను." ఆసందేశము మిక్కిలి జాలిగొలుపు నదై యుండుటచేతను తనమీద మొదటినుండియు నభిమానము గలిగి తనకెన్నో యుప

కారము లంచేసిన రాయబులారువద్దనుండి యీ సందేశము వచ్చుటచేతను నానక దానిని జులకనగా జూడలేకపోయెను. అందుచేత బలుడు మూర్ధనుడు జేరినదినముననే నానకు లల్లోవద్ద సెలవు పుచ్చుకొని యమ్నాబాదు విడిచి తాల్వెండికి బోవదలచెను.

తలచెనుగాని పయనము గావలసివచ్చినప్పుడు వాని మనస్సు మిక్కిలి సందేహించెను. రాయబులారుమీది విశ్వాసముచేత ననుగ్రహముచేత స్వగ్రామదర్శనము వాని కిష్టమైనను వాని మనస్సునకు మిగుల బాధను కలిగించునట్టివియును మనోధైర్యమును సంపూర్ణముగా శోధింపగలిగినట్టివియు నగు స్థితిగతు లక్కడ నున్నట్లు వానికి బొడగట్టెను. ఎవ్వనిగూర్చి గురునానక కప్పటికిని భయపడుచుండెనో యా కాలు డక్కడ నుండెను. దయామయస్వరూపిణియు గన్నతల్లియు నగు త్రిప్తాదేవియు నక్కడనే యుండెను. కోపోద్దీపితుడగు తండ్రి కఠోరభాషణముల నతడొకవేళ సైరించి సరకు సేయక మనోధైర్యమును జిక్కబట్టిన బట్టుగాక! మూర్తీభవించిన కృపాపారపమో యన్నట్లు మృదువులగు మాటలతో, జాలిగొల్పుచూపులతో బాష్పపూరితములైన కన్నులతో దరికి జేరి మీద చెయివైచి తల్లి బతిమాలుకొన్నప్పు డెంతనిశ్చలహృదయముగల కొడుకైన వేలవడి లోబడకుండునా! సహజముగ మాతృభక్తి యతిశయముగా నున్న నానకువంటి గుణవంతుడు తల్లిమాటల కెదురాడ గలడా? మాటకు మాట యుక్తికి యుక్తి చెప్పి యతడు లౌకికమార్గము సరికాదని సహేతుకముగా నిష్ఠురైన వాదించినచో వారి నతడు వాదమున నోడింపగలడు. అట్లు చర్చలు పెంచక వాదములు సలుపక కన్నీళ్లనే యుక్తులుచేసికొని దయనీయములగు మాటలనే యాయుధములుగ జేసికొని కొడుకుల గెలిచి వారిమనస్సులు ద్రిప్పదలచు తల్లులముందఱ పుత్రుల నీమములు నిలుచుట యరిది. ఇందుచేతనే పూర్వకాలమునందు గౌతమబుద్ధుడు మొదలగు మహాత్ములందఱు సన్యసించి యా యాశ్రమమునందు జాలకాలము స్థిరపడినపిదప తల్లిదండ్రులు మొదలగు చుట్టములం జూడబోయిరి. అవి యన్నియు నానకు చక్కగా నెఱిగినవాడు గావున తాల్వెండికి బోవుదునా మానుదునా యని మొదట నించుక సంశయించియు జననీజనకుల ప్రార్థనలకు మనోవైకల్యము నొందక స్థిరముగా నిలిచినప్పుడే తన వైరాగ్యము వైరాగ్యమగుననియు గానిచో నది వ్యర్థమనియు భావించి తప్పక యా యూరికి బోయి తన మనోధైర్యమును బరీక్షించుకొన దలచెను. అట్లు కృతనిశ్చయుడై యిరువురు శిష్యులచేత ననుగమ్యమానుడై నానకు తాల్వెండికిబోయి గ్రామము ప్రవేశింపక యూరుబైట చెఱువువద్ద బసచేసెను.

అతని రాక గ్రామములో దెలిసినతోడనే గ్రామవాసులు స్త్రీలు పురుషులు బాలురు వృద్ధులు దమతమ పనులంకట్టి తమగ్రామవాసియైన యామహాయోగి దర్శనము చేయ తీర్థప్రజవలె వచ్చిరి. నానకు మనసులో దలంచినట్లె తండ్రియగు కాలుడు తల్లి త్రిప్తాదేవి పినతండ్రులలో నొకడు వానికడకు వచ్చిరి. అప్పుడు నానకు సన్యాసి వేషముతో నుండెను. కాషాయవర్ణముగల రెండుగజముల గుడ్డ తలకు చుట్టుకొని యుట్టిదే మఱియొకటి మొలకు జుట్టుకొని మఱియొక చిన్నగుడ్డ చేతఁబూని యాతఁడు గూర్చుండెను. ఊరుబైట చెట్టుక్రింద నట్టిదీనవేషముతో గూర్చుండిన యాకుమారునిఁ జూచి తల్లితండ్రుల మనస్సెట్లు పరితపించెనో చదువరులే యూహించుకొనవచ్చును. కాలుఁడు కుమారుని నీచస్థితిఁ జూచినతోడనే మనోవైకల్యము నొంది కోపపరవశుఁడై నానకును దూషించుటకు బ్రయత్నించెనుగాని శాంతస్వభావుఁడగు వాని తమ్ముఁడక్కడనే యున్నందున మనస్సు స్వాధీనములో నుంచుకొమ్మని సోదరునకు హితోపదేశము చేసి వానిసంరంభము నుమాన్పెను. అనంతరము దండ్రికుమారునితోఁ సంభాషింపదలప నానకు పినతండ్రి లోకవృత్తమెఱిగినవాఁడయినందున గాలుని మాటలాడ మొదలుపెట్టనేని వానిపారుష్యమువలన దండ్రికొడుకుల కడవటికేగలిగిన విరోగము మఱింతయధికమగునని తానిని మాటలాడ నీయక తానే ముందుప్రసంగమునకు దొరకొనెను. అన్నకొడుకును బినతండ్రి పలుకరించి ముందుగా స్వగృహమునకు రమ్మని నానకును బిలిచెను. నానకు వానికిట్లు ప్రత్యుత్తరమిచ్చెను. "అయ్యా! నాయిల్లు వేఱుగ నున్నది. మీయిల్లు నాయిల్లుగాదు. అన్నియిండ్లతో సంబంధము వదలుకొంటిని". కొడుకిచ్చిన యీయుత్తరము చెవిని బడినతోడనే త్రిప్తాదేవి, పుత్రస్నేహమితరాలోచనలను జయింపమనసు పట్టలేక వలవలయేడ్చుచు గుమారుని పాదములపై బడెను. మాతృవిధేయుడగు నా గురువు తల్లిని పరమభక్తితో బాదములపైనుండి లేవనెత్తి వినయమున నిట్లనియె "అమ్మా! క్షమయే నాకు దల్లి సంతుష్టియే నాతండ్రి మనోజయ కారణమయిన సత్యమే నా పినతండ్రి"

ఆయుత్తరము మిక్కిలి ప్రశంసనీయమైనదిగదా ? గురునానకు తన యెట్టయెదుటనున్న బంధువులు బంధువులుగారని విస్పష్టముగఁ జెప్పి దీనబంధువుఁడగు భగవంతుఁడే తన బంధువుఁడనియు వానిసన్నిధానమునకుఁ గొనిపోవందగిన సత్యాదిసద్గుణములే తనమిత్రములనియుఁ దెలియఁజేసెను. అప్పుడాతనిపలుకులు వినినవారందఱు వాని నిశ్చలభావమునకు సంతసించి యతఁడు గృహస్థాశ్రమమును సంపూర్ణముగ విడి

చినాఁడనియు జితేంద్రియుఁడై యాశల జయించి సంసారసంబంధము ద్రెంపినాఁడనియును వానిచరిత్రము ముందుముందు సుజనవందితమై యుండుననియు నమ్మిరి. కష్టతరమైన మాతాపితృసందర్శన మీవిధమున బరిణమించినందుకు తన మనోధైర్యము వీడ్లకుండ దాను బయటపడినందుకు నానకు మిక్కిలి సంతసించెను.

"మాతృదేవోభవ, పితృదేవోభవ" యని వేదములు పలుకుచున్నవి గదా. సమస్తమతములు తలిదండ్రులసేవ యుత్తమోత్తమమని యంగీకరించుచున్నవి గదా! అట్టియెడ తలిదండ్రులకు విధేయుఁడైన నానకు తన యకాల సన్న్యాసమువల్ల వారికిరువురకు నధిక మనోవేదన నేల కలిగింపవలయును! తల్లిదండ్రుల దుఃఖపెట్టినయతఁడు గురువగునా యని కొందఱడుగవచ్చును. స్వలాభము నెంచుకొని తల్లిదండ్రులను విడుచువాఁడు దూష్యుడగును గాని లోకానుగ్రహార్థము గృహము దారపుత్రులను మాతాపితలను స్వలాభమును స్వసౌఖ్యమును బరిత్యజించి యేకాకియై సుజనులు చుట్టములుగ జ్ఞానులు సహకారులుగ శిష్యులు బిడ్డలుగ లోకమే యిల్లుగ భగవంతుఁడు తండ్రిగ భావించి పాపుల నభ్యుద్ధరింప బాటుపడి మేనులు ధారవోయునట్టి మహాత్ములు తలిదండ్రులకు మనోవేదన గలిగించి నంతమాత్రమున దూష్యులుగారు. ఈతండ్రి దుఃఖించినను పైనున్న యాతండ్రి వాని గుణములకు సంతసించును. ఈపుత్రులుతగు జీవనాధారము లేక స్వల్పకాలమిడుమలు బడినను శిష్యపుత్రులు వేనవేలు సద్గతులు గలిగి సుఖింతురు. బుద్ధదేవుఁడు తలిదండ్రుల మాట సరకు సేయక సన్యసించె. శంకరాచార్యుఁడు తల్లికనిష్టమైనను వివాహపూర్వమందె నాలవయాశ్రమము స్వీకరించెను. రామానుజాచార్యుఁడు శ్రీపురమునకు వచ్చినభార్యను విడనాడి భగవత్సేవకై త్రిదండసన్న్యాసి యయ్యెను. బసవేశ్వరుఁడుపనయనమే చేసికొననని గురులమాట ధిక్కరించెను. పురాణములలో నిట్టి యుదాహరణము లనేకములు గలవు. శుకుడు బాల్యముననె సన్న్యసించి తండ్రియగు వేదవ్యాసునకు మిక్కిలి మనఃఖేదము గావించెను. ప్రపంచారంభమునుండియు లోకోపకారులైన మహాత్ములు గురువచనంబుల నతిక్రమించియే లోకబంధవులైరి. మాతాపితల శాసనము లతిక్రమింపగూడదనివారు గృహములందుండిన మానవలోకము గతియేమి కావలసియుండును ?

అట్లు నానకు తల్లియొక్కయు బిన తండ్రియొక్కయు మాటల నిరాకరింప బిన తండ్రి కాళునితో నాలోచించి రాయబులారు మాట మీద దమకుమారునకు గౌరవము గలదని యెఱింగి యతనిచేత బుద్ధి చెప్పించ వచ్చుననుకొని వానినింట బసవేయుమని

నానకును వేఁడుకొనెను నానకు రాయబులారు నిమిత్తమే యక్కడికి వచ్చినందున వానియింటికి బోవుట కేయాటంకము జెప్పక కదలిపోయెను పోయి యామహాత్ముఁడు వార్థకము చేత గదల లేకయున్న రాయబులారును గాంచి వాని పాదములను దనహస్తములతో స్పృశించెను. ఆ శతవృద్ధు మలినములగు తన పాదములను బవిత్రుఁడగు గురువు స్పృశించి నందను నొచ్చుకొని లేవలేక కూర్చుండియే తని శిరస్సు మహనీయుడగు నానకు యడుగులం జేర్చెను. గురువు వృద్ధుని శిరస్సు సగౌరవముగా నెత్తినేమమడిగెను. ప్రియభాషణంబులతో నిరువురు గొంతసేపు గడపిన పిదప నానకు బంధువులు వంట బ్రాహ్మణు నొక్కనిగుదిర్చి నానకు నిమిత్తము వంటజేయించిరి. కాళుఁడు ద్రిప్తాదేవి యాదినము తమయు రాయబులారు గృహమందే పడియుండిరి. వారు తనయింటివద్దభృత్యులవలె నేలపడియుండిరో యాకారణము రాయబులారు చక్కగా నెఱిఁగి తానె ముందుగ నామాటకదపక వారి నోటనుండియే వారికోరికలు జెప్పింపఁ దలఁచి ప్రసంగింప జొచ్చెను. అతఁడు సంభాషణ మారంభించి నాలుగు పలుకులు పలికినతోడనే త్రిప్తాదేవి కన్నుల నీరు పెట్టుకొని తద్దయు దుఃఖితయై రాయబులారు హృదయము కరగి పోవునట్లు వగచుచు వాని నిట్లు ప్రార్థించెను "ఈకష్టకాలమందుమీరు తప్పనాకు సాయము చేసి మమ్ముదేల్చువారెవరు లేరు. నాయనా నీయావచ్ఛక్తి వినియోగించి నాబిడ్డతో నెట్లు చెప్పవలయునో యట్లుచెప్పి వాఁడీయూరునుండి పోకుండునట్లు చేసి పుత్రభిక్షము పెట్టుము. నీకెంతో బుణ్యముండును" రాయబులారు త్రిప్తాదేవిమాటల చేత బరవశుఁడై నానకును జూచి నీతల్లి యభీష్టమ్మెట్లైన నెరవేర్పఁగలవాయని యడిగెను. అడిగి యంతట నూరకుండక రాయబులారు వెండియు నిట్లనియె "నాకు విస్తారము సేద్యము జేయదగిన భూమిగలదు. అందుకొంతనీకుచితముగనిచ్చెద. నీవు శిస్తు నీయనక్కఱలేదు. కావలసిన పాలేళ్లను బంపెదను. నీవేమియు శ్రమపడనక్కఱలేదు. అదిశేద్యము చేయించుచు నిచ్చట నుండగలవా"

అతని మాటలకు గురువిట్లు బదులు చెప్పెను. "అయ్యా! భగవన్నామ స్మరణమే విత్తన మగుగాక సంతుష్టియే నాగలియగుగాక! వినయమేకలుపు తీతయగుగాక ఇట్లుకృషిచేసిన నీభక్తివిశేషము చేతను దైవానుగ్రహము చేతను మంచిపంట పండఁగలదు. నీయిల్లు నిత్యకళ్యాణ సదనమైవర్ధిల్లగలదు." అప్పలుకులువిని దాపుననున్న పినతండ్రి నానకుతో మెల్లగ నిట్లనియె "నీవు వ్యవసాయము వంటి కష్టపు బని జేయలేనియెడల మంచియంగడి నొకదానిం బెట్టి సుఖముగ గూర్చుండి పనిచేయుచుండుము",

అనవుడు గురువు పినతండ్రికిట్లనియె "ఇక నాలస్యము చేయక నీజీవితకాలమునే యంగడి చేసికొనుము. భగవన్నామమే యాయంగడిలో సరకుగా నేర్పరచుకొనుము. ధ్యానమే యాసరకు సంపాదించు సాధనముగా నుంచుకొనుము. ఈశ్వర నామవ్యాపారము చేయు వర్తకులతోనే చేరసారములు జేయుచు కాలముగడపుము. ఇంతకన్న వేఱు వర్తకము చేయకుము" అట్లు పలికిన కొడుకుమాటలు విని పినతండ్రి వెండియు నిట్లనియె "నీకంగడి పెట్టుట కిష్టము లేని పక్షమున విదేశములు చూడ నభిలాష గలిగిన పక్షమున గుఱ్ఱపువర్తకము జేయుము. అది కారణముగా నీవనేక దూరపుపట్టణములం జూడఁగలవు". నానక దాని కిట్టు బదులు చెప్పెను "నీవు శాస్త్రములను వినెడు వ్యాపారమునుండి సత్యమను గుఱ్ఱములను దూరదేశములకు దీసికొనిపోయి యమ్ముము. నీదారిబత్తెముగ సత్కార్యములు సౌజన్యత గొనిపొమ్ము. ఆవ్యాపారమువల్ల నీకుగలుగు లాభమేమన నీవక్షయలోకమున కఱిగి నిరాకారుఁడగు నీశ్వరు సాన్నిధ్యమును జేరి మోక్షసుఖము ననుభవింపఁగలవు" జ్ఞానియగు కుమారుఁడన్ని విధముల నిహలోక వ్యాపారము గోసి బ్రహ్మజ్ఞానబోధకములగు పలుకులు పలుకుచుండఁ బినతండ్రి వానినెంతమాత్రము గ్రహింపలేక సిగ్గులేక మరల నిట్లనియె. "పోనీ నీకు గుఱ్ఱపువర్తకమిష్టము లేదేని సర్కారు వారివద్ద నుద్యోగములో జేరుము". ఈమాటకు గురువు నోటినుండి యీక్రింది యుత్తరము వచ్చెను. "నీవు మనసారభగవంతుఁడను సర్కారును గొలువుము. నీయాత్మ భగవన్నామము మీఁది భక్తిని వృద్ధి పొందించునట్లు నడచుకొనుము. నీయధికారమంతయు దోషములమీఁద జూపి వానిని నశింపఁజేయుము. అట్లు చేయుదువేని నీవు ప్రసిద్ధుఁడవగుదువు"

నానకునకుం బినతండ్రికి జరిగిన సంభాషణము విని రాయబులారు నానకుయొక్క మనస్సునకు నిష్టముగా నుండునట్టి పని వానిచుట్టములు చెప్పలేదనుకొని తాను చేయబోవు నుపదేశము తప్పక యంగీకరింపఁబడునని నమ్మి గురువుతో నీవిధమున బలికెను. "బీదవాండ్రకు నీవొక సత్రమును వేయుము దానిపోషణకు గావలసిన ధాన్యమంతయు బండదగిన మంచిభూమి మూడునూతులుగలది నేను నీకిచ్చెదను. నీవు శిస్తురూపకముగా నాకేమియు నీయనక్కఱలేదు." ఇది సత్కార్యమగుటచే సాధారణముగ నానకు మెత్తబడి దానికొప్పుకొనవలసినదే. కాని యాతని మనోనిశ్చయము దృఢమైనదగుటచే నతఁడు పూర్వాపర్యములు విచారించి దానికి సమ్మతింపలేదు. ఇదియే కాదు. ఎవ్వరెంతెంత మంచి యుపదేశములఁ జేసినను నానకుమనస్సున కవి యెక్కవయ్యె.

అట్లు కొన్ని దినములు తాల్వొండిలోనుండి నానకు రెట్టకేల కాయూరు విడిచి పోవలెంజెను. ఏలయన నతఁడచ్చట నున్నందువలన పారమార్థికచింతగల కొంతమందికే జ్ఞానోపదేశపూర్వకమగు నుపదేశము జరుగుచుండెను గాని విశేషజనులకు వినోదముదీరుట తప్ప నెక్కువయుపయోగము లేకపోయెను. గ్రామము విడిచి పోవదలఁచినప్పుడు వానిని మిత్రులు జుట్టములు తలిదండ్రులు చుట్టుకొనిరి. తలిదండ్రులు సన్యాసాశ్రమమును విడువుమని చాలఁబ్రతిమాలిరి. రాయబులారు సయితము తలిదండ్రుల పక్షముఁ బూని వ్యాపారమేమియుం జేయనక్కఱలేదనియు నూరక స్వగ్రామమున నుండినంజాలు గావున దానికైన నియ్యకొనఁదగుననియు నానకును వేఁడుకొనెను. అందుకు నానకు తద్విషయమున దనయిష్టము చెల్లదనియుఁ దనయిష్టమే చెల్లినపక్షమున జననీజనకులను మెప్పించుటకంటె మఱియొక కార్యము తనకు లేదనియుఁ దనయిష్టముకంటె నతీతమైన పరమాత్ముని యిష్టమెట్లో నట్లు జరుగవలసినదనియు బదులుచెప్పెను.

అట్లు చెప్పి బలమూర్ధములు వెంబడింప గురువు ప్రయాణోన్ముఖుఁడై యున్నపుడు రాయబులారు వానిసమీపమునకుఁ బోయి తనకొక ధర్మకార్యము జేయ నిష్టముగలదనియు నెయ్యది యుత్తమోత్తమ కార్యమగునో గురువునోటనుండి వినవేడుకగలదనియు జెప్పెను. పరోపకారము జేయఁదలఁచిన సత్పురుషునకు నిరుత్సాహము జేయుట భావ్యము గాదని గురువు వాని మంచితలంపునకు సంతసించి తాల్వొండిగ్రామములో మంచిచెరువు లేనందున మంచినీళ్లతటాక మొకటి త్రవ్వింపవలెనని వానికుపదేశము చేసెను. నానకు స్వగ్రామములో నున్నపుడచట చెరువు లేనందుకు మిగుల విచారించుచు వచ్చెను. గ్రామస్థులు దానివలన జాల నిడుములు బడుచువచ్చిరి. రాయబులారు గురువు నిర్ణయించిన ధర్మకార్యము సర్వజనోపయోగమైనదని శ్లాఘించి తగిన తావు వెదకి చెరువు త్వరలోనే త్రవ్వించి దానికి గురునానకు పేరు పెట్టెను.

## —౦: సప్తమాధ్యాయము :౦—

ఇంతవఱకు నానకు దేశాటనమని చెప్పఁదగిన సంచారము చేయలేదు. అతఁడు తిరిగిన యూళ్లు రెండు మూడుమాత్రమే గలవు. అందు మొదటిది సుల్తానుపురము. రెండవది యమ్నాబాదు గ్రామము. ఈయూళ్లకుబోవునపుడు మార్గవశమున నతఁడొకటి రెండుగ్రామములు చూచియుండవచ్చును. అతని శరీరము వానిమనస్సువలెనే స్వేచ్ఛావిహారమందాసక్తిగల దగుటఁజేసి యతనికి దేశాటనమునందు మిక్కిలి యిష్టముండెను.

బలమర్దనులు వెంబడింప నట్లు తాల్వొండీ గ్రామము విడిచి నానకు ముందుగా యమ్నాబాదునకు బోయెను. అచ్చట పూర్వశిష్యు డగు లల్లో వాని నాదరించి పదునైదు దినములం తనయింట నుంచుకొనెను. అటనుండి గురువు తత్సమీపమందున్న మఱియొక తావునకుఁ బోయెను. ఆస్థలమున కిప్పుడు నానకుమఠమని పేరు. ఆకాలమందచ్చట గాఢనియమములతో యోగాభ్యాసము జేయునట్టి సిద్ధు లనేకులుండిరి. గురునానకు శిష్యసమేతుఁడై యాస్థలమునకుఁ బోయి సిద్ధాశ్రమమున కెదురుగా నొకనారింజచెట్టుక్రింద గూర్చుండెను. ఆకిచ్చలిచెట్టదివఱకు జాలకాలమునుండి శోషించి మోడుగా నుండెనఁట. గురువు దానిక్రింద నాశీనుఁడైనతోడనే యావృక్షము పచ్చని యాకులు లేతచిగుళ్లు గలిగి దర్శనీయమయ్యెనఁట. ఈవింత దూరమునుండి సిద్ధులు గనిపెట్టిరఁట. వారు తమకంటె నెక్కువయోగులు లేరని కడుగర్వితులై యుండువారఁట. తమకంటె నెక్కువ మహిమలుంగల మహాత్ములు వచ్చెనని తెలిసికొని యాసిద్ధులు నానకుచుట్టుం జేరిరి. జోగులు పదిమంది జేరినప్పుడు వేదాంతచర్చ తప్ప మఱియొక విషయమేది చర్చింపఁబడును? ఆసిద్ధులు తమకు దుస్సాధ్యములగు వేదాంతవిషయక ప్రశ్నముల నెన్నో గురువునడిగిరి గురువు దేనిలోను వారికిం దీసిపోవఁడయ్యె. సిద్ధులడిగిన ప్రశ్నలకన్నిటికి గురు నవలీలగ మనస్సునకు దత్క్షణమే నాటునట్లుగ ననుభవసిద్ధమగునట్లుగా బ్రత్యుత్తరములు చెప్పి యందఱను సంతుష్టులఁ జేసెను. అంతటనాసిద్ధులు నానకు తమకంటె నెక్కువసిద్ధుఁడని గ్రహించి వానిం గొనిపోయి తమమఠమున జేరుమని ప్రార్థించిరి. నానకు దానికి సమ్మతింపక మనుష్యున కాత్మశుద్ధి సత్ప్రవర్తనము మొదలగునవి యుండవలయును గాని పైవేషముల వలన లాభములేదనియు వేషధారణముతోఁ బనిలేక యంతఃకరణశుద్ధికై పాటుపడవలయుననియు తా నేమతమునందు నే తెగయందు జేరుట లేదనియుఁ జెప్పెను. అట్లు పలికి నానకు వారికాసమయమున గొన్ని నీతివాక్యముల నుపదేశించెనఁట. అవి భాషాంతరమునం దుండుటచే వాని తాత్పర్య మీ క్రింద బొందుపరచుచున్నాఁడ.

"కాషాయాంబరము దండము ధరించుటలోను మే నెల్ల బూడిద పూసికొనుటలోను యోగము లేదు. సిరస్సు ముండనము చేయించుకొనుటలోను శంఖము లూదుటలోను యోగము లేదు. లౌకికాకర్షణములచేత జుట్టబడియు మనుష్యుఁడా యాకర్షణములకు లోఁబడక వానికతీతుఁడై యుండుటలో నిజమైన యోగమున్నది. వట్టిమాటల వల్ల నిజమైన యోగమురాదు. ఈశ్వరుని సర్వవ్యాపకత్వ మెవ్వఁడు తెలిసికొనునో

యతఁడే యోగి. యోగము మనస్సులోనె కాని దానికి వెలుపల లేదు. యోగము గోరీదిబ్బలలో లేదు. యోగము శ్మశానములలో లేదు. ఈశ్వరైక్యము చెందుచున్నావని దొంగమార్గములు బడుటలో లేదు. నానాదేశముల కరిగి తీర్థములందు మునుఁగుటలో లేదు. లౌకికాకర్షణములకు లోఁబడక వాని కతీతుఁడై యుండుటలోనే యోగము కలదు. మన యాదిగురువగు పరమేశ్వరుని దెలిసికొంటిమా సర్వసంశయములు నివారణములగు. అంతట ముక్తి కరతలామలక మగును. భగవద్విషయమును దెలిసికొనఁగోరువాఁడు ముందుగా మనశ్శాంతి సంపాదింపవలయును. మనస్సు తన యిష్టమువచ్చినట్లు దిరుగుటమాని నిశ్చలమైనప్పుడు పరంజ్యోతి తనలోనె వెలుఁగుచుండును తనలో నీశ్వరతేజము ప్రకాశించుచున్నట్టు తెలిసికొనుటయే యోగము."

అనంతరము నానకు సిద్ధమతము విడిచి గంగానది ప్రవహించెడు భూములలో సంచారము చేయుదలఁచి పయనమయ్యెను. ఈయాత్రాచరిత్రలు సత్యమునకు దూరములై యద్భుతములతో మహిమలతో నిండిన కల్పనాకథలై యున్నవి. నిజమైన చరిత్రము నిమిత్తము నానకునుగూర్చి వ్రాయఁబడినప్రాచీనగ్రంథములను మన మెంతవెదకినను నూటికొకచోట నెక్కడనో యొక సత్యమైన వృత్తాంత ముండును గాని తక్కినదంతయు బృహత్కథలోనున్న కథలకన్న నెక్కుడుచిత్రకల్పనలతో నిండియుండును.

ఆచరిత్ర లట్లుండుటకు మూడు ముఖ్యకారణములు గలవు. అందు మొదటిదిది. ఆచరిత్రలు వ్రాసినవారు భూగోళశాస్త్రమేమో యెఱుఁగరు. వారు జన్మమధ్యమున స్వదేశమగు పంజాబు నప్పుడప్పుడు చూచియుందురు; కాని గంగానది ప్రవహించెడి దేశములనుగాని యచ్చట నివసించు జనులనుగాని వారెన్నఁడు జూచి యెఱుఁగరు. ఏస్థలములఁ జూడక స్తిమితముగా నిండ్లవద్ద గూర్చుండి విన్నకథల నాధారములు చేసికొని చరిత్రలు వ్రాయు గ్రంథకర్త లంతకంటె నెక్కువగ నేమి వ్రాయఁగలరు రెండవకారణ మిది. ఆచరిత్ర లీయాత్రలు జరిగిన ముప్పదియేండ్ల తరువాత వ్రాయఁబడినవి. అవ్రాతలుగూడ నానకుయొక్క ప్రియభక్తుఁడగు బాలుఁడే చెప్పి వ్రాయించుటచేత బయలుదేరినవి. బాలుఁడు గురువుతోగూడ దిరిగినను విద్యాగంధశూన్యుఁ డగుటచేతను మూఢవిశ్వాసముగలవాఁ డగుటచేతను గ్రంథకర్తలకు గురువు వృత్తాంతమును చెప్పునప్పుడు నిజమగు వృత్తాంతములను సరిగ జెప్పలేక తన పిచ్చినమ్మకముల నందు జొనుపుచు చాలకాలము గడచినపిదప చెప్పుటచే సరిగా జ్ఞాపకములేక తన మందమతికి స్ఫురించిన వన్నియుం దెలుపుచు గురుచరిత్రమందలి యీభాగమును సంశయాస్ప

దముగ జేసెను. మూడవకారణ మిది. గురునిచరిత్రము వ్రాయఁబడునప్పటికి గురువుమృతు
డయ్యెను. అతని కీర్తి యార్యావర్తమం దంతట వ్యాపించె. ఎన్నో మహిమలు వాని
కారోపింపఁబడెను. ఎన్నోయద్భుతములు వానింగూర్చి చెప్పుకొనఁబడెను. చరిత్రకా
రులు వానిమహిమలు వినినవారే గావున తాము వినినవి చుట్టుప్రక్కలజనులు చెప్పుకొ
నునవియగు లోకసామాన్యచరియలతో బుస్తకముల నింపిరి. ఆగ్రంథములలోనున్న
విశ్వాసపాత్రములుకాని యంశములు విడిచి వానియాత్రలు కొన్ని వర్ణింతము.

అతఁడు గంగాతీరమునం బయనముచేసి వంగదేశమునకు వచ్చెను. అచ్చట
కొంతకాలముండి పిదప నతఁ డాసామునకు బోయి యచ్చట ననేకమాసము లుండెను.
ఈప్రయాణములలో మర్దనుఁడు మిక్కిలి డస్సి తన గురువువలె భక్తితత్పరుఁడై మార్గాయా
సము మరచుటకుఁగాని బలునివలె వైరాగ్యముఁగలిగి క్షుత్పిపాసలకోర్చుటకుఁగాని సమర్థుఁడు
గాకపోయెను. ఆస్సాముదేశమున సంచరించుచుండ నానకు షేకుఫరీదను మహమ్మ
దీయయోగియొక్క వంశస్థుఁడైన యొకతురకం గలుసుకొనెను వారిరువురుఁ గొన్ని
నాళ్ళు గలిసియుండి భగవద్విషయము లనేకములు చర్చించిరి. వారెడబాయున
ప్పుడు మతద్వేషములు లేక యొండొరులం గౌఁగిలించుకొని విషాదముతో వేరైరి.
ఆసామునుండి గురు వోఢ్రదేశమునకుఁ బోయి జగన్నాథక్షేత్రమును దర్శించి యచటి
యాలయమునం దర్చకులు పండాబ్రాహ్మణులు నిత్యకృత్యములలోఁ జేయు నకార్యము
లంజూచి యేవగించెను.

జగన్నాథక్షేత్రమునుండి నానకు దక్షిణదేశమునకుఁ బోయి యందనేకదివ్యస్థల
ముల సందర్శించి యక్కడనుండి సింహళద్వీపమునకుం జనెను. ఈగురువు వెళ్ళునప్పటికి
సింహళద్వీపమును శివనాథుఁడను రాజు పాలించుచుండెను. తన దేశమునకు ముర్వురు
క్రొత్తమనుష్యులు వచ్చిరనియు నందు సామాన్యసన్యాసులను బోలని యొక విరాగి
గురువైయుండెననియు శివనాథరాజు విని వాని జూడఁగోరెను. కోరి యాతనిం జూడ
బోవుటకుముందు వాని ప్రజ్ఞ యెట్టిదియో జగద్వంచనము సేయవచ్చిన మాయయోగి
యో నిజమైనసన్యాసియో వాని మనోనిశ్చలత యెట్టిదో కనుగొని యనంతరము వాని
దర్శనమునకు బోవలయునని రాజు నిశ్చయించుకొని పంచభక్ష్యపరమాన్నములతో నిండిన
యన్నమును విలువగల చీనిచీనాంబరములను సొగసుకత్తియలగుపడుచుకన్నియలనుయో
గికిఁ గానుకగాఁ బంపెను. గురునానకు మొదటి రెండువస్తువుల జేతితో ముట్టక కన్ని
యలం గన్నెత్తి చూడక నిరాకరించుటయు నవి తోడ్కొనిపోయినవారు వచ్చినదారి నె

భగ్నమనోరథులై పోయిరి. తన కావించిన పరీక్ష గురునందలి గౌరవముం బెంప రాజు స్వయముగ నానకును సందర్శింపవచ్చి యంతటి మహాత్ముని రాక చేత తనరాజ్యము ధన్యమైనదని కొనియాడెను. ఆమహారాజు చేసిన యాదరణమునకు సంతుష్టుండై కాఁబోలు నానకు సింహళద్వీపమున రెండుసంవత్సరముల యైదుమాసములుండెను. ఆదీవి వెడలి లాతిభూములకు నానకు పయనమైనప్పుడు మర్దనుఁడు నిరంతర ప్రయాణములచేత విసికి గురువును విడిచి యుద్దేశ్చం జనియెను. అట్లు మర్దనుఁడు గురువును బాసిపోయినను కొంతకాలము వాని నెడబాసియుండునప్పటికి వాని కేమియుం దోఁచక పిచ్చియెత్తి నట్లుండుటచే గురువు పిలువక పోయినను తనంతట తాను వచ్చి నానకును గలిసికొనెను.

అనంతరము గురునానకు లోకానుభవజ్ఞానము సంపాదింప భరతఖండమునకుఁ జుట్టుప్రక్కలనున్న యనేక మ్లేచ్ఛదేశములకుఁ బయనము చేసెను. ఆయనచూచినట్లు జెప్పఁబడినదేశములలో నొక్కదానిపేరేనియు నీనాటి భూగోళశాస్త్రజ్ఞు లెఱుంగరు. ఆదేశముల కా కాలమున నట్టి పేళ్లుండెనో లేక చరిత్రకారులు జగమునలేని దేశముల నూహించి గ్రంథములలో వ్రాసిరో మనము చెప్పఁజాలము. మనము నిశ్చయముగా నొక్కవిషయమును మాత్రము చెప్పఁగలము ఇస్లాము మతస్థాపకుఁడగు మహమ్మదువారి జన్మస్థలమైన యరేబియా దేశమునకు గురునానకు పోవుట నిర్వివాదాంశము. ఆదేశమునకు సముద్రయానము చేసెనో యెట్టదారినిఁ బోయెనో చెప్పఁజాలముకాని త్రోవలో పారసీకదేశపు రేవుపట్టణమగు బుషాహరునగరము నాయన జూచెను. మార్గవశమున నతఁ డేయూరికిఁ బోయిన నాయూర బ్రహ్మజ్ఞానమునం దాసక్తిగల మనుష్యులం జేర్చి వారికుపదేశముం జేసి జ్ఞానబీజముల నచ్చట నాటె నవి పెరిగి ఫలించునని తోఁచిన చోట్ల చిన్నసంఘము లేర్పరచి ప్రతిసమితి నొక్క పెద్ద నేర్పరచి వానికి భాయి యను పేరు వెట్టి యతనియాజ్ఞకు వారు బద్ధులై యుండునట్లు శాసించి యటుపిమ్మట పోవుచువచ్చెను. హిందూదేశమునకు బడమట నున్న దేశములలో నేటికిని ధర్మశాలలుండుట కాద్యకారణ మితఁడే. అట్లు సమాజములు స్థాపించుటలో గురునానకుయొక్క తలంపు క్రొత్తమతము స్థాపింపవలయునని కాదు. మిక్కిలి పురాతనమైన యార్యుల యుపనిషన్మతమును జగమునకు జాటుటయే యాయన ముఖ్యసంకల్పము. తనచేత నుపదేశింపఁబడిన జ్ఞానవాక్యములయందు నమ్మికగల జనులు నిర్భయముగ తమధర్మముల ననుష్ఠించి యితరులకు మార్గప్రదర్శకులై యుండవలయునని యాయన యెల్లచోటుల నొక్క చెప్పుచువచ్చె.

అరేబియాప్రయాణములో నానకు వాని శిష్యులు నిర్బాధకముగ నన్ని ప్రదేశములుం జూచుటకు తురక వేసములు వేసికొనిరి. నానకు సహజముగ కలహముల కిష్టపడని పరమసాధువౌట చేజగడములు రాకుండ నుంటకట్టు వేషము మార్చెనే కాని భయము చేత నెంతమాత్రము కాదు. ఏలయన నానకు మహమ్మదువారి జన్మప్రదేశమగు మెక్కాపట్టణమునకుఁబోయి పుణ్యభూములు చూడఁదలంచియు మహమ్మదీయులకు విరుద్ధములగు నాచారములనే గొన్నిటిని నెరపుచువచ్చెను. మెక్కాలో మహమ్మదీయుల కొక దేవాలయము గలదు. కాబా యని దానికిం బేరు ఆ యూరికిఁ బోయిన మహమ్మదీయుఁ డెవ్వఁడు దన కాళ్ళు కాబా యున్న వైపునకు జాపి పగలు కాని రాత్రి కాని శయనింపఁడు. పండుకొన్నప్పుడు తలయే కాబావైపున నుండవలయు. నానకు తరుచుగా రాత్రులు పండుకొనునప్పుడు తన కాళ్లు కాబావైపునకుఁ జాపుచువచ్చె. తురకలకు భయపడినవాఁ డట్లు చేయునా? ఆ గుడియధికారి యొకనాఁడు శాస్త్రవిరుద్ధముగా శయనించిన నానకునుఁ జూచి దైవగృహమువైపు కాళ్లుచాపుట యనాచారమని కఠినస్వరముతో మందలించెను. ఆతనికి గురు విట్లు ప్రత్యుత్తర మిచ్చె. "దేవునిగృహ మేప్రక్కను మాత్రమే యుండి యేప్రక్కను లేదో నాకు దెలియదు. నీ వెఱుఁగుదువేని నా కాళ్లు చేతఁబట్టుకొని దేవుని మందిరము లేని ప్రక్కకు వాటిని ద్రిప్పుము." ఆలయాధికారి వాని పలుకులు విని మతిమాలినను లెక్కసేయక నోట పరిహాసములు సేయు మొండివాఁడై యుండవచ్చునని భావించి వాదము ముదరనీయక యంతతో సరిపెట్టెను. మెక్కా వెళ్లిన మహమ్మదీయులు మహమ్మదువారు పరమపదము వేంచేసిన స్థానమగు మెదీనాకు వెళ్ళి యాయనసమాధిఁ జూడక పోరు. నానకు మెక్కాలోఁ జూడవలసిన వైచిత్ర్యములనెల్లఁ జూచి సంతుష్టుఁడై మెదీనాకుఁ గూడ బోవఁదలంచుచుండ మర్దనుఁడు తన గురువు మెదీనాకు జనండనుకొని యక్కడకుఁబోక తప్పదని పట్టుపట్టెను. అదివరకే వెళ్లఁదలఁచిన గురువు శిష్యుని ప్రోద్బలము చేత వెంటనే బయలుదేరి పంద్రెండు దినములు పయనము చేసి మెదీనాపట్టణము జేరి మహమ్మదుసమాధిం జూచి కొన్ని దినము లచ్చటనుండెను. ఆదినములలో నతఁడు మెక్కాలోవలెనే యిక్కడను సమాధివైపు కాళ్ళు చాపి శయనించుచువచ్చెను. మెక్కాలోనున్న యా యజమానునికంటె మెదీనాలో నున్న సమాధియజమానుఁడు చండతరుఁడు దురహంకారుఁడు. ఇం దక్కజ మేమున్నది! దేవుని దూషించినప్పుడు సయితము నోరెత్తక గురువుల పేరెత్తినతోడనే రాక్షసులవలె మీఁదబడి మనుష్యులను దూషించి వీలగునేని జేయిచేసికొను పరమభాగవతులు ప్రతిమతమున వేనవేలు గలరు. మెక్కా మెదీనాపట్టణములకుబోయి యా పుణ్యభూముల జూచిన పిదప మహమ్మదువారినిఁ గూర్చి నానకున కెట్టి యభిప్రాయము కలిగెనో శిష్యుఁడగు బలుని యీక్రిందివాక్యములవలన స్పష్టమగును. ఈమాటలు బలునినోటనుండి వచ్చినను గురునియభిప్రాయములే యగుట నిజము.

# బెంజామిన్ ఫ్రాన్క్లిన్

అమెరికాఖండము మొట్టమొదట కొలంబసుచేత గనిపెట్టఁబడి నీకాలమునఁ దెల్లవారికి గాఁపురమైయున్నది. ఈతెల్లవారాఖండముయొక్క ప్రాంతకాఁపురులు కారు, వీరు రమారమి మూడువందల యేఁబది యేండ్లక్రిందట నాఖండమునకు రా మొదలఁబెట్టి యిప్పటికి ఖండమంతయు వ్యాపించియున్నారు. వచ్చిన యీతెల్లవారు మొట్టమొదట యూరపుఖండ నివాసులు. వారివారి దేశములలోనుండి పరిపాలకులు మతవిషయములలో వారిని మిక్కిలి బాధించుటచే స్వదేశము నవిడిచి యాఖండమునకుఁ బోయి సుఖముగఁ గాఁపురముండిరి. కొందఱు యూరపుఖండవాసు లమెరికాఖండములోఁ గొన్నిభాగముల జయించి ధనార్జనము నిమిత్తము జయింపఁబడిన దేశముల పరిపాలనము నిమిత్త మాఖండమున స్థిరవాసులైరి. ఈకారణములచేత యూరపుఖండవాసులగు తెల్లవా రమెరికాఖండము నాక్రమించి యాఖండమునందు దరివఱకు నివసించుచుండిన ప్రాంతకాఁపులు నేల దున్నుకొనుట బట్టనేసికొనుట మొదలగు నాగరికపు బను తెలియఁగక మృగప్రాయులై యుండినందున వారిని జయించి చంపి యిప్పుడు సర్వాధికారులై యున్నారు. ప్రాంతకాఁపులగు నాయనాగరికు లిప్పుడు లోకమున నామావశేషులైరి. ఈకథానాయకుఁడగు బెంజామిన్ ఫ్రాన్క్లిన్ యొక్క తండ్రి స్వదేశము నివాసయోగ్యము కానందున దక్కిన తెల్లవారివలె యూరపుఖండమందలి యింగ్లాండు దేశమునుండి క్రీస్తుశకము 1682 సంవత్సరప్రాంతముల నమెరికా ఖండమునకుఁ బోయి బోస్టన్ పట్టణమునఁ గాఁపురముండెను. బోస్టనుపట్టణ ముత్తరపు టమెరికాలోనున్నది. బెంజామిన్ ఫ్రాన్క్లిన్ క్రీ॥ శ॥ 1706 సంవత్సరమందు జనవరి 17వ తారీఖున బోస్టన్ నగరములో జన్మించెను. తల్లిదండ్రుల కితఁడు పదునైదవ బిడ్డఁడు. ఆదంపతుల కితని తరువాత మఱియిద్దఱు బిడ్డలుఁగూడ జన్మించిరి. బెంజామినుయొక్క తండ్రి కొవ్వువత్తులు చేసుకొనియు సబ్బుబిళ్లలు జేసుకొనియు జీవనము జేయుచుండెను. అతఁడు చిన్ననాటనుండి యావృత్తి నేర్చుకొననందున దానియందు మిక్కిలి జాణగాక యేదో యొకవిధమునఁ జేయుచు స్వకుటుంబమును మిక్కిలి కష్టముతోఁ బోషించుకొనుచు వచ్చెను. తండ్రి బెంజామినును మతాచార్యునిగఁ జేయఁదలఁచి యాసంబంధమైనవిద్యఁ

జెప్పించుటకై యొక చిన్నబడిలోఁ జదువవేసెను. ఈబాలుని పినతండ్రి యొకఁ డతివఱికే మతాచార్యుఁడై యుండి తానప్పుడప్పుడు వినిన మతవిషయకోపన్యాసములను సంగ్రహముగవ్రాసి యుంచుకొనెను. అన్నకొడుకు మతాచార్యుఁడుగా నుండఁదలఁచుట విని పినతండ్రి సంతసించి తనవద్దనున్న మతోపన్యాసములు వానికిఁ జదువనిచ్చెను. మతాచార్యుడు కావలసిన బాలుఁడు కళాశాలలలో శాస్త్రవిద్యలు నేర్చికొనవలయును. కళాశాలలలోఁ జదివించుటకు ధనము విశేషము కావలయును. కొడుకునుగళాశాలలోఁ జదివించుటకుఁ గావలసిన ధనము తనవద్ద లేకపోవుటచేతను మతాచార్యవృత్తి విశేషధనలాభము దెచ్చునది కానందునను దండ్రి బెంజామినును బడిమానిపించి వాచకము గణితము నేర్పగలయొక మనుష్యునకు వాని నప్పగించెను.

అట్లు కొంతకాలము గణితవాచకముల నేర్చికొన్న పిదప జనకుఁడు కుమారునిఁ జదువుమానిపించి తనపనిలో సహాయముఁ జేయుటకింటనే యుంచెను. బెంజామిను వత్తులు కత్తిరించుట యచ్చులలో గరగించిన కొవ్వు పోయుట దుకాణముమీఁద కూర్చుండుట బాకీలు వసూలుచేయుట మొదలగు పనులు చేయుచుండెను. ఈవృత్తి బెంజామినునకు బొత్తుగా నిష్టములేకపోయెను. బెంజామినుయొక్క సోదరుఁడొకఁ డదివఱకు తండ్రితో గలహించి యోడలమీఁద బనిజేసికొనఁదలఁచి లేచిపోయెను. అనిష్టమైన వృత్తిలో బలవంతముగాఁ గుమారుని నిలిపినయెడల నితఁడు కూడ లేచిపోవునేమోయను భయమున జనకుఁడు పుత్త్రుని కిష్టమైన వ్యాపారమునందు బ్రవేశపెట్టఁ దలఁచుచుండెను. తలఁచి తనయుని వెంటబెట్టుకొని తండ్రి పట్టణమందలి నానావృత్తులవారి యిండ్లకుఁబోయి యెల్లపనులు వానికిం జూపెను. బెంజామిను చేతిపనులన్నియుఁ గన్నులార జూచి కత్తులుచేయుట నేర్చుకొనఁదలఁచి యాపని జేయుచున్న యొకచుట్టమువద్ద సుమేజావానిగఁ జేరెను. ఈక్రొత్తపనిలో బెంజామిను కొన్నినాళ్లుండునప్పటికి వానిచుట్టము పనినేర్పుటకు దనకుచాలసొమ్మిమ్మని యడిగెను. ఆసొమ్మిచ్చుకొనలేక తండ్రి బెంజామినును బని మానిపించెను.

ఇట్లు బెంజామిను నిర్వ్యాపారముగనుండ నతని సోదరుఁడు జేమ్సు క్రొత్తగా నింగ్లాండునుండి వచ్చెను. అతఁడు పుస్తకముల ముద్రించుపని నేర్చికొనినవాఁడు గావున ముద్రాయంత్రమొకటి బోష్టనులో దెచ్చి పెట్టి పనినారంభించెను. తండ్రి బెంజామినును వానివద్ద పని నేర్చికొమ్మని యప్పగించెను. అప్పుడు బెంజామిను పండ్రెండు సంవత్సరములవాఁడు. బెంజామినునకు నిరువదియొక్క సంవత్సరములు వచ్చువఱకు

తనవద్దనే యుంచుట కొడంబడినపత్రమున బనిసేర్పుదునని జేమ్సు తండ్రితోఁ బలికెను. తండ్రి దానికొడంబడుటయు బెంజామిను సోదరున కొప్పగింపఁబడెను.

తండ్రి కుమారుని నీవృత్తియందుఁ బ్రవేశపెట్టుటకు ముఖ్యకారణ మేమన జిన్నవాటనుండియు బెంజామినునకు గ్రంథములు జదువుటయందు మిక్కిలి యాసక్తియుండెను. తల్లిదండ్రులుచక్కెర మొదలగునవి గొనితినుటకుఁ దనకిచ్చెడురూకలుగూడ దాఁచుకొని బెంజామిను పుస్తకములనే గొనుచుండును. తండ్రివద్ద గొన్నిపుస్తకము లుండెను. కాని యవియెల్ల మతవిషయములలో గల యభిప్రాయ భేదములను దెలుపునవి సాధారణముగ నట్టిగ్రంథములు బాలురకు రుచింపవుకదా? దుర్భేద్యములగునట్టి వేదాంతగ్రంథములగూడ నంత చిన్నతనమందు గష్టపడి బెంజామిను చదివెను దానినిబట్టి వానికి గ్రంథాసక్తి యెంతగలదో మీరే యూహించుకొనుఁడు అవిగాక తండ్రియొక్క చిన్న గ్రంథభాండాగారమందు మఱియొకటి రెండు లౌకికవ్యవహారములం గూర్చిన గ్రంథములు లభింప వాని నతఁడు జాగ్రత్తగ జదివెను. ముద్రాయంత్రశాలలలోఁ బనిచేయుచున్నందున వానిగ్రంథపఠనమున కెక్కువ వీలుగలిగెను. తమవద్ద పుస్తకముల నచ్చువేయించుటకు వచ్చు పుస్తకవర్తకులతో వానికి విశేషపరిచయము కాగా నతఁడు వారివద్ద నేదియేని యొకగ్రంథము సాయంకాల మెరువు పుచ్చుకొని మరునాఁ డుదయము దానిని వారి కిచ్చివేయవలసియున్నందున రాత్రి చాలసేపు మేలుకొని యాపొత్తముంజదివి ముగించుచు వచ్చెను. ఇట్లు గ్రంథాసక్తి మిక్కుటముగా నున్నందుకు బనిలో నశ్రద్ధ నజాగ్రత్త యెంతమాత్రము లేవు బుద్ధిసూక్ష్మతగలిగి శ్రద్ధగలిగి బెంజామిను మేనుదాఁచుకొనక పనిచేయుటచే సోదరునకు జాల లాభము కలుగుచుండెను. ఆపురమందు మంచి మనస్సుగల వర్తకుఁ డొకఁడుండెను. ఆతనివద్ద నుపయోగములగు గ్రంథము లనేకములుగలవు. అతఁడు తరుచుగ నచ్చుకూటమునకుఁ బోవుచుండుటచేత బెంజామినుయొక్క బుద్ధికుశలత గ్రంథాసక్తి గ్రహించి వానిం దనయింటికి తీసుకొనిపోయి గ్రంథావళిం జూపి కావలసిన పుస్తకముం దీసికొని పోయి చదువుకొనవచ్చునని వానితోఁ జెప్పెను. అందుచేత బెంజామినునకు జాలలాభము గలిగెను.

ఇఁకమీఁద బాలుఁడగు బెంజామిను తనబుద్ధికుశలత మఱియొకమార్గమునం జూపనారంభించెను. ఇతరులు చేసిన గ్రంథముల నిరంతరము జదువుటవలన దాను కొన్నిపంక్తుల వ్రాసిన నెట్లుండునో చూడవలయునని బెంజామినుకు మనసునం దోఁ

చెను. తోఁచుటయు నతఁడు కొన్ని చిన్నపద్యములనల్లెను. అతని కవనధోరణముఁ జూచి జేమ్సు పద్యములనూని పాటలువ్రాయుమని పురికొల్పెను. బెంజామిను మన బొబ్బిలిపాటలవంటి రెండు పెద్దపాటలు వ్రాసెను. జేమ్సు వాటి నచ్చువేసి తమ్మునిచేతనే పట్టణమునం దమ్మించెను. అందొకటి జాల మనోహరముగా నుండినందున బురజనులు దానిని విశేషముగఁ గొని తమకముతోఁ జదివి సంతోషించిరి. తనకవనము లోకులకు హృదయరంజతముగ నుండుటచే బెంజామిను తానొక కవీశ్వరుఁడననుకొని యించుక గర్వించెను. అట్లు గర్వమునమనస్సులోఁగల బాలుఁడు చెడిపోవునని భయపడి తండ్రి బెంజామినును బిలిచి వానిపాటలలోనున్న తప్పులను నసందర్భములను జూపి యా వ్రాత వట్టిమాటలపోగుగాని కవిత్వము గాదని చెప్పి వాని నొప్పించి యంతట నూరకుండక కవులు మిక్కిలి దరిద్రులగుదురని వానిమనస్సునకు నాటబలికెను. తండ్రియుపదేశము విని బెంజామిను కవిత్వముఁ జెప్పుట మానుకొనెను.

ఆపట్టణములో బెంజామినువంటి బాలుఁడే మఱియొకఁడుండెను. అతనికి గ్రంథపఠనమందు మిక్కిలి తమకముండెను. అతనిపేరు కోలెన్సు. వానికి బెంజామినునకుఁ జాల పరిచయమైనందున వారిరువురు గలిసికొన్నపుడెల్ల తమకుం దోఁచిన విషయములఁగూర్చి చర్చ చేయుచుందురు. ఒకనాఁడు ప్రసంగవశమున వారిద్దఱు స్త్రీలసామర్థ్యము లెట్టివని వారికి విశేషముగ విద్య చెప్పించుట యుచితమా యనుచితమా యని యూహింపఁ జొచ్చిరి. స్త్రీలు శాస్త్రవిద్యలలో బరిశ్రమఁ జేయుటకు దగరని కోలెన్సు వాదించెను. బెంజామిను వానివాదమునకుఁ బ్రతిపక్షముఁ బూని చదువుచెప్పించినచో స్త్రీ లన్నిశాస్త్రములఁ జదువుటకు దగినవారేయని వాదించెను. కోలెన్సునకు బెంజామినుకంటె శబ్దప్రయోగమం దెక్కువ నేర్పుండెను. బెంజామిను వాదమే యుక్తియుక్తమై ప్రబలముగా నుండినను వాదించునప్పుడు శబ్దముల సౌష్ఠవము లేనందున కోలెన్సు మాటపైనున్నట్లు గానబడెను. అందుచే బెంజామిను గృహమునకుఁ బోయి తనవాదమంతయు మంచిమాటలతోఁ గాకితముమీఁద వ్రాసి ప్రతికక్షికిఁ బంపెను. కోలెన్సు దానికొక ప్రత్యుత్తరము వ్రాసెను. అట్లిరువురకుఁ గొంతకాలము వ్రాతలవాదముఁ జరుగగా వారు చెరి నాలుగు జాబులువ్రాసికొనిరి. బెంజామిను తానువ్రాసినజాబు లన్నిఁటికి దనవద్ద నకళ్లుంచుకొనెను. ఒకనాఁ డాజాబులు వాని తండ్రిచేత బడెను.

నామాంతరముఁ గలదు. ఆయన కొంతకాలము తంజావూరు మహారాజువద్ద పనిచేసి పిదప నింగ్లీషుదొరతనమువారివద్ద తహసీల్దారయ్యెను. ఆయనకుమారుఁడు గోపాలరావుతండ్రియు రాఘవపంతులను నామాంతరముగల బావాపండితుఁడు సుప్రసిద్ధుఁడైన శరభోజీ మహారాజువద్ద కొన్నినాళ్లు పనిచేసెను. ఆయన కైదుగురు కుమారులు. గోపాలరావందుఁ గడపటివాఁడు. బావాపండితుఁడు గణపతి యగ్రహారమున మూఁడు సంవత్సరము లుద్యోగవశముననుండి పిమ్మట తిరువడియను గ్రామమున గొంతకాలముండి యాకాలమున తిరువాన్కూరు సంస్థానమున మంత్రియు రాజామాధవరావుగారి తండ్రియునగు దివాను రంగారావుగారి యాదరణమునఁ దిరువాన్కూరునకుఁ బోయెను. బావాపండితుని కుమారుల కిద్దఱకు వెంటనే యాసంస్థానమున నుద్యోగములయ్యెను. తిరువాన్కూరులో నున్నపుడె బావాపండితుఁడు కాలధర్మమునొందెను. కాలధర్మము నొందుటచే వానికుటుంబము తంజావూరునకుఁ దిరిగి వచ్చెను.

గోపాలరావు తక్కిన సోదరులవలెనే తండ్రివద్ద బాల్యమున సంస్కృత మహారాష్ట్ర భాషల నేర్చికొనెను. ఆకాలమున నింగ్లీషులోఁ గొంత ప్రవేశముగల దేవాజీరావను నతఁడు గోపాలరావున కింగ్లీషులోఁ బ్రవేశముఁ గలిగించెను. కాలక్రమమున నాంగ్లేయభాష నితఁడు తనవశము చేసుకొనుట స్వయంకృషివల్లనేగాని పరసహాయముచేత గాదు. అతఁడు మరణమొందుటకు నాలుగేండ్లక్రిందట నొకరితో నిట్లుచెప్పెను "నాచదువొక పాఠశాలలోఁగాని కళాశాలలోఁగాని నేర్చుకొన్నదిగాదు. నేను పదునైదేండ్ల వాఁడనైనప్పుడు నాపాట్లు నేఁబడి నేర్చికొన వలసినవాఁడనైతిని. ఆభాషాప్రవేశము మొట్టమొదట నాకొక పల్లెటూరిలో నైనది. ముప్పది యైదేండ్లక్రిందట పల్లెటూళ్లలో నెంతపాటి యింగ్లీషువిద్య యుండునో మీరే యూహించుకొనుఁడు. పశ్చిమఖండభాషలు ప్రకృతిశాస్త్రములు నేను నేర్చికొనుట పరసహాయ మెంతమాత్రము లేని నాస్వయంకృషివల్లనే. స్వయంకృషి యనినచో నిందతిశయోక్తి యేమియు లేదు. నాపుస్తకములు మాత్రమే నాగురువులు."

పదునేడేండ్ల ప్రాయమువాఁ డైనప్పుడు గోపాలరావు తంజావూరు కలక్టరు కచ్చేరిలో నుద్యోగము సంపాదించుకొని రెండుసంవత్సరములు ముగియకమునుపె యొకయింజనేరు కచ్చేరిలో మేనేజరయ్యెను. ఈయుద్యోగమున నతఁడు మూఁడుసంవత్సరము లుండెను. ఆకాలములో నట్టియుద్యోగస్థుల కెంతెంత లాభముండెడివో విస్తరించి వ్రాయనక్కఱలేదు. గోపాలరావు తానున్న మూఁడేండ్లలో శక్యమైనంత

వలెను లంచగొండితనము నణచుటకుఁ బ్రయత్నము చేసెను. చెన్నపట్టణపు హైకోర్టులో జడ్జియై చాలప్రసిద్ధికెక్కిన హాలోవేదొర యాకాలమునఁ దంజావూరుజిల్లాలో అశిస్టంటు కలక్టరుగా నుండి గోపాలరావుయొక్క బుద్ధివిశేషమును ధర్మతత్పరత సామర్థ్యము గనిపెట్టి చాలమెచ్చి తాను చెన్నపట్టణమునకు వచ్చినపిదప గోపాలరావునకుఁ జాల సహాయము చేసెను. 1854 వ సంవత్సరమున గోపాలరావు విద్యాశాఖలోఁ బ్రవేశించి కుంభకోణమందలి దొరతనమువారి పాఠశాలలో సహోపాధ్యాయుఁడయ్యెను. 1857వ సంవత్సరమున చెన్నపట్టణపు యూనివరుసిటీ స్థాపింపఁబడెను. ఆసంవత్సరమే గోపాలరావు ప్రవేశపరీక్ష (మెట్రిక్యులేషను) కుఁ బోయి యందుఁ గృతార్థుఁడయ్యె. తరువాత రెండేండ్లకే యనగా 1859వ సంవత్సరమందే యతఁడు పట్టపరీక్ష (B-A) కుఁ జదివి యందు మొదటితరగతిలో మొదటివాఁడుగఁ గృతార్థుఁడయ్యెను. అట్లు గోపాలరావు పరీక్షలలోఁ బ్రథమగణ్యుఁడై వచ్చుట మిక్కిలి కష్టసాధ్యము. ఏలయన నతఁ డుపాధ్యాయుఁడగుటచేఁ బ్రతిదినము పాఠశాలలో నాలుగంటలు పనిజేసి యలసి యింటికిఁబోయి గృహకృత్యములు నెరవేర్చుకొనుచుఁ దీరికయున్నపుడు స్వయముగా గ్రంథములఁ జదువుకొనుచు వచ్చెనేగాని యొకపాఠశాలలోఁ జేరలేదు. ఒకగురువువద్ద పుస్తకముఁబట్టి చదువలేదు. అహాహా స్వయంకృషిసహజపాండిత్యమునను శబ్దములు గోపాలరావునందే సార్థకములైనవి గదా! అప్పుడు గవర్నరుజనరలుగారి యాలోచనసభలో సభికుఁడైన ఫోర్బ్సుదొర కలకత్తా నగరమందుండగా నీతఁడు పట్టపరీక్షం దేరినట్లు విని గోపాలరావున నీక్రిందివిధమున జాబువ్రాసెను.

"నీవు నాకు వ్రాయకపోయినను బి-ఏ పరీక్షలో నీవదుమ మొదటివాఁడుగ గృతార్థుఁడవైనవాఁడవు నీవే యనుటకు నాకు సందేహము లేదు. నేను నీయభివృద్ధియందిష్టముగలవాఁడనని నీవు తలంపకపోయినందుకు నాకు విచారముగనున్నది. ఈపరీక్షలో దేరినందుకు నిన్ను నేను బహూకరించుచున్నాను. ఈకృతార్థత నీపరిశ్రమకు నీబుద్ధికిఁ దగియున్నది. ఈవిజయము పునఃపునః ప్రయత్నములకు నిన్నుఁ బురికొల్పుగాక." హాలోవేదొర యాసమయమున నీక్రిందిలేఖ వ్రాసెను. "నేను చాల జాబులువ్రాయఁజాలను. అయినను నీసంతోషసమయమున నాయానందమును దెలియఁజేయకుండుటకు నీపురోభివృద్ధి గోరకుండుటకు నామనసొప్పినది కాదు."

అదిమొదలు గోపాలరావుయొక్క జీవితమంతయు విద్యాశాఖలోనే గడుపఁబడెను. అందు జాలభాగము కుంభకోణ కళాశాలలోనె జరిగెను. కుంభకోణకళాశా

లయొక్క కీర్తి యిద్దఱివల్ల దేశమంతట వ్యాప్తమైనది. అందొకఁడు పోర్టరుదొర రెండవయతఁడు గోపాలరావు. ఆకళాశాలలో నింగ్లీషుభాష గణితశాస్త్రము విద్యార్థులకుఁ బోధించుభారము చాలవరకు గోపాలరావుమీఁదఁబడెను. దక్షిణహిందూస్థానమున నాంగ్లేయవిద్యా ప్రాబల్యమునకుఁ బ్రథమపురుషుఁడైన పవెలుదొర, గోపాలరావును మించినవారు సాధారణముగ నుండరని పలుమారు చెప్పెను. 1870—71—72. సంవత్సరములలో దొరతనమువారు గోపాలరావును గొంతకాలము పాఠశాలాపరీక్షాధికారి (ఇనస్పెక్టరు) గా నియమించిరి. ఈయుద్యోగము తెల్లవారికె గాని నల్లవారి కిచ్చెడు వాడుక పూర్వము లేదు. అట్టి గొప్పయుద్యోగము స్వదేశస్థులలో మొట్టమొదట గోపాలరావునకే యిచ్చిరి. ఆయుద్యోగములోనుండి గోపాలరావు పాఠశాలలలో నేర్పఁబడు విద్య మిక్కిలి యుపయుక్తముగా నుండునట్లు చేయుటకై పాటు పడెను,

చెన్నపురి దొరతనమువారుగూడ స్వదేశస్థుఁడు పాఠశాలా పరీక్షాధికారిగా నుండఁదగునో లేదో యని మొదట సంశయించి యాయుద్యోగ మాయన కిచ్చిరి. ఆయన మూఁడేండ్లు నధికారము జేయునప్పటికి దొరతనమువారు సంశయనివృత్తులై గోపాలరావు పని మిక్కిలి నేర్పుతోఁ జేసెననియు స్వదేశస్థు లీయుద్యోగమునకుఁ దగుదురనియు వ్రాసిరి. చెన్నపట్టణపు యూనివరుసిటీవారు వాని సామర్థ్యమును మెచ్చి యాయన నొక ఫెల్లోగాఁ జేసిరి.

**1872** మొదలు 74 వఱకు గోపాలరావు కుంభకోణము కాలేజీకిఁ బ్రధానోపాధ్యాయుఁడై (ప్రిన్సిపలు) యుండెను. ఆసంవత్సరములలో కుంభకోణ కళాశాలయొక్క పరీక్షాఫలితములు వెనుక పోర్టరు దొరగారి కాలములో కంటె నెక్కువ తృప్తికరములుగా నుండెను. ఆనాటి డైరక్టరు గవర్నమెంటువారికి వ్రాయు సంవత్సరచర్యలో గోపాలరావునుగూర్చి యీక్రిందివిధమున వ్రాసెను. "మనరాజధానిలో రెండవకళాశాలకుఁ బ్రధానోపాధ్యాయుఁడై గోపాలరావు తత్పదవికిఁ దనయర్హతను సంపూర్ణముగ స్థాపించియున్నాఁడు. కావున కాలీవచ్చినప్పుడాయన కీయకలిప్పుడు ఆయన సామర్థ్య మెట్టిదైనను పరీక్షాఫలితము లెంతతృప్తికరములుగానున్నను మెచ్చవలసిన యధికారు లెంతగా మెచ్చినను దొరతనమువారు మాత్రము వానికా కళాశాలలోఁ బ్రధానోపాధ్యాయత్వము ఖాయముగ నీయఁజాలరైరి. 1878వ సంవత్సరమున దొరతనమువా రాయనను కుంభకోణమునుండి చెన్నపట్టణ కళాశాలకుమార్చి యర్ధ

శాస్త్రమందు దేశచరిత్రమందుఁ బండితునిగఁజేసి తెల్లవారితో సమానమైన జీతముగల గౌరవస్థితికిఁ దెచ్చిరి. అంతటి విద్యావంతునకు నంతటి సమర్థునకు గవర్నమెంటువా రాయుపకారముఁ జేసినందుకు జనులు సంతసింపక యిదివరకే జేయనందుకు కుంభకోణము కళాశాలలోఁ బ్రధానపండితోద్యోగ మీయనందుకుఁ జాలవగచిరి. తెల్లవారితో సమానమైన యుద్యోగ మీయకపోయినను జీతము వారితో సమముగ నిచ్చి మఱియుం గన్నీళ్లుదుడుచుటకు దొరతనమువారు వానికి రాయబహదూరను బిరుదము నిచ్చిరి.

గోపాలరావుయొక్క కడపటిదినములు చెన్నపట్టణము రాజకీయ కళాశాలలోనె గడుపఁబడెను. 1883 సంవత్సరమున నతఁడు శక్తికిమించిన పని చాలకాలమునుండి చేసినందున దారుణజ్వరపీడితుఁడై బాధపడెను. అతనిశరీరస్థితి తృప్తికరముగా నుండనందున 1885 వ సంవత్సరమున నతఁ డాఱుమాసములు సెలవుపుచ్చుకొని కుంభకోణమునకుఁ బోయెను. ఈసెలవునుండి యాతఁడు తిరిగి యెన్నఁడు బనిలోఁ జేరలేదు. కుంభకోణమునఁ గొన్నినాళ్లుండునప్పటికి రోగము క్రమక్రమముగ తగ్గుటకు మారు ప్రబలముకాఁగా తగిన చికిత్సకొఱకు బంధువులు వానినిఁ జెన్నపురికిఁ దోడ్కొని వచ్చిరి. గోపాలరావు చెన్నపట్టణమందె 1886 సంవత్సరం మే నెల 11 వ తారీఖునఁ గాలధర్మము నొందెను.

ఆయనమరణ మెల్లవారిని దుఃఖింపఁజేసెను. చెన్నపురి రాజకీయకళాశాలాధికారులు వానిశక్తికి వానిచేసిన పనికి మెచ్చుచు మరణమునుగూర్చి మిక్కిలి విచారించిరి. అప్పటి డైరక్టరగు డాక్టరు డంకను వానిమరణముంగూర్చి దొరతనమువారికి వ్రాయుచు నీక్రిందివిధమున వానింగూర్చి ప్రశంసించెను. "గోపాలరావు విద్యాశాఖలో 1884 వ సంవత్సరమునఁ బ్రవేశించి యిప్పటికి ముప్పదిరెండేండ్లు సేవచేసెను. ఈదీర్ఘకాల మతఁడు దొరతనమువారికి లోకమునకుఁ జాల మేలు చేసెను. అతఁడు గొప్పశాస్త్రజ్ఞుఁడయ్యు నాంగ్లేయభాషాపాండిత్యమునకు మిక్కిలి ప్రశంస చేయబడుచువచ్చెను. ఇంగ్లీషు భాషాగ్రంథావళి బోధించుటలో గొప్పయూరపియనులతో బోల్చునపుడు గూడ నతఁడు ప్రథమగణ్యుఁడై యుండువాఁడు. కొన్నిసంవత్సరములనుండి ప్రెసిడెన్సీకాలేజీలోను యూనివరుసిటీలోను వానితోఁ గలిసియుండు భాగ్యము నాకు లభించినందున వాని మరణమువలన గలిగిన విశేషనష్టమును నేను తెలిసికొన గలిగితిని". ఆసంవత్సరమే మే నెల 26 వ తారీఖున డాక్టరు డంకను గోపాలరావు జ్యేష్ఠపుత్రున కీక్రిందిజాబు వ్రాసెను. "నేను ఆయనను చాలసంవత్సరములనుండి

యెఱుఁగుదును. వాని సద్గుణములకు నీతికిఁ జాల సంతసించువాఁడను. ఇటీవల ప్రసిడెన్సీ కాలేజీలో నాయదృష్టమువల్ల వానికిఁ బరిచితుఁడ నైతిని. ఒక్కసారియైన మా మైత్రికి భంగము కలిగినట్లు నేఁ దలఁపను. ఏ దాని కతఁ డలంకారమైయుండెనో యట్టి విద్యాశాఖలోనున్న యుద్యోగస్థు లందఱు మీతో సమానదుఃఖితులై మీదుఃఖము వారిదుఃఖముగ నెంచుకొనుచున్నారు."

ఈవిధముగానే గోపాలరావు కుమారునకు విద్యావంతు లనేకులు పరామృశ జేయుచు జాబులవ్రాసిరి. "మీతండ్రి యకాలమరణమునకు నాకు గలిగినంతదుఃఖము మఱియొకరికిఁ గలుగ"దని రంగనాథము మొదలియారి వ్రాసెను. హైకోర్టు జడ్జియైన ముత్తుస్వామియయ్యరుగూడ నీక్రింది విధమున జెప్పెను. "నేను మొట్టమొదట వానిని 1854 వ సంవత్సరమున గలిసికొంటిని. అది మొదలు చివరవరకు నొక్క విధముననే వానియందు గౌరవము భక్తియుగలిగియుంటిని. ఆయనబుద్ధి మిక్కిలిగొప్పది దానిని ముప్పదియేండ్లు కృషిచేసి వృద్ధిబొందించెను. ఆయన విద్యాసామర్థ్యము పాఠశాలలోఁ జదువుకొనుటవలన గాక స్వపాండిత్యమువలనను బరిశ్రమవలనను గలిగెను. ఆబుద్ధికి నాపాండిత్యమునకు నిష్కళంకమైన సత్ప్రవర్తనముం దోడుచేసి తన విధికృత్యమును శ్రద్ధతో నెరవేర్చును. ఆయన మహావిద్యావంతు లెట్లుండవలెనో యట్లుండెను". చెన్నపురి క్రిస్టియన్ కాలేజి ప్రధానోపాధ్యాయుఁడగు రివరెండు డాక్టరు మిల్లరు తనకాలేజిపక్షమునఁ బ్రకటింపఁబడు క్రిస్టియన్ కాలేజి పత్రికలో గోపాలరావును గూర్చి ప్రశంసించెను. "దక్షిణహిందూస్థానవాసుల యభిప్రాయమున మిక్కిలి గొప్పవాఁడగు గోపాలరావు మరణమునుగూర్చిన విచారములో నే నితరులతో గలియుచున్నాను. కీర్తిశేషుఁడైన యాతఁడు తనదేశస్థుల ప్రవర్తనమును సరిగా బోతబోయుటలోఁ జాలకృషి చేసెను. పాఠశాలాపరీక్షకుఁడుగాను మంచియుపాధ్యాయుఁడుగాను గోపాలరావు తాను చేయఁదలఁచిన పని సంపూర్ణముగఁ జేయుటయెగాక యితరుల చేతఁ జేయింపవలసివచ్చినప్పుడుకూడ మిక్కిలి పట్టుదలతోఁ జేయించెను. పూనికతో బనిచేయుటయె యాతనివంతుగాని ఫలితములను బహుమానములను ముందు లెక్కజూచుకొనుట వాని పనిగాదు. తన విధికృత్యము దాను చేయుటయె వానికిఁ బ్రథమకార్యము. ఏపనినైన నెరవేర్చుటలో నతని కతఁడె యాలోచించుకొనును గాని రెండవవానితో నాలోచింపఁడు. తన చేయఁదలఁచినపని న్యాయమని తోఁచెనా యాయన యది జనసమ్మతమైనను గాకపోయినను దానిని నెరవేర్చితీరును.

అతనిమార్గమును దక్షిణహిందూస్థానమందలి విద్యావంతు లందఱు నవలంబింప వలయు". ఆయన జీవితకాలమంతయు నుపాధ్యాయత్వమునందె గడపుటచేత వాని నెఱిఁగినవారందఱు వాని బోధనాశక్తి, సామర్థ్యమును గూర్చియే పలుకుదురు. ఆయ నను గూర్చి యాయన శిష్యుఁడొకఁడు కుంభకోణమునగర మందిరమున నీక్రిందివిధము నబలికెను. "అతండు సంపూర్ణుఁడైన యుపాధ్యాయుఁడు. పాఠపుస్తకము ను విద్యా ర్థులకు బోధించునప్పుడు పుస్తకములలోనున్న సంగతులనేగాక వాటికి సంబంధించిన విషయము లనేకములు దెచ్చి లోకానుభవము కలిగించుచుండును. అవిషయము లెవ్వి యనగా నుత్సాహము గలిగించు ప్రాచీనకవిత్వములు జిత్రకథలు మహాత్ములయొక్కయు యోగులయొక్కయు చరిత్రములు. అప్పుడప్పు డతఁడు చెన్నపురిరాజధానిలో మహా విద్వాంసులైన సుబ్రహ్మణ్యంఅయ్యరు రంగనాథం మొదలియారు మొదలగు వారింగూర్చి వారిమార్గము ననుసరించి ప్రవర్తింపుఁడని విద్యార్థులం బురికొలుపుచుండును. పక్షి తనకుఁ బుట్టినపిల్లలు గ్రమక్రమంబున నాకాశమున నీఁదికెగురునట్లు చేయుట కెంత శ్రమపడునో యావిధముననే తనవిద్యార్థులను లోకయాత్రలో నిరపాయముగ నడుచు వారిగఁ జేయుటకతఁడు పాటుపడుచుండును." ఆయనకు మహారాష్ట్రభాషలో మంచి ప్రవేశము గలుగుటచేఁ జిన్నతనమునుండియు నతఁ డందుఁ గవిత్వము చెప్పెను. బాల్య మునం దాయన వ్రాసినపద్యములు దొరకలేదు. మరణమునకుఁ గొన్నిమాసములక్రిందట నాంగ్లేయభాషలో గోల్డుస్మిత్తు మహాకవి వ్రాసిన వానప్రస్థుఁ డని యర్థమువచ్చు "హెర్మిట్టను పద్యకావ్యమును మహారాష్ట్రమునకుఁ దర్జుమా చేసెను. అది యిప్పటికిని మహారాష్ట్రజనులచేత సంతోషపూర్వకముగా జదువఁబడుచున్నది. ఆయనకు సంస్కృ తమునుండియు మహారాష్ట్రమునుండియుఁ బ్రాచీనమహాకవులు రచియించిన శ్లోకము లెన్నియో గంతపాఠముగఁ జదువఁగల శక్తి యుండెను. స్వకుటుంబములో నున్నవారికిని గోపాలరా వప్పుడప్పుడు చిత్రచిత్రశ్లోకములు చదివి సంతోషపెట్టుచుండును. గోపా లరావునకు సంగీతశాస్త్రమునందును గొంత ప్రజ్ఞ గలదు. మంచిపాటను విని యాయన మిక్కిలి మెచ్చువాఁడు. గోపాలరావు పాఠశాలలో బాలురకు విద్య చెప్పి వారి మనస్సుల నెంత వికసింపఁజేసి జ్ఞానవంతములుగ జేసెనో యావిధముగా బడిలేనప్పుడు గృహమునందుఁ గూర్చుండి తనతో మాటలాడవచ్చిన పరిచితులను మిత్రులను విజ్ఞానగర్భి తములగు తన సంభాషణములచేత వచ్చినప్పటికంటె నెక్కువ వివేకులుగఁ జేసి పంపు చుండును. ఆయనతో మాటలాడుట యెంతో లాభకరముగా నుండును. ఆయన యేదిమాటలాడినను ముందుగ యోచించి యుక్తియుక్తముగ సర్వజనగ్రాహ్యముగ నుండునట్లు మాటలాడును. జ్ఞాన మితరులకు నుపదేశించుట వాని కెంతయిష్టమో నేర్చికొనవలసిన యంశములుండిన నితరులవద్దనుండి యవి నేర్చికొనుటయు వాని కంతే యిష్టము. నిరంతరము గ్రంథపఠనమం దాసక్తి యుండుటచేతను నూతనజ్ఞాన మార్జింప నభిలాషగలుగుటచేతను గోపాలరావు యావజ్జీవము విద్యార్థియే యని చెప్ప వచ్చును.

గోపాలరావు బుద్ధి యెంతసూక్ష్మమైనదో నడత యంతపవిత్రమైనది. జనులాతని ప్రజ్ఞకెంతసంతోషించిరో యోగ్యతకు నంతియె సంతోషించిరి. పాండిత్యమునకుఁ బావనచరిత్రము తోడగుట బంగారునకు దావి యబ్బుటగదా! సత్యమునందు ధర్మమునందు నాయనకు గల యధికప్రీతిచేత నతఁ డొకప్పుడు కఠినముగ భయంకరముగ మాటలాడుచుండును. అందువలన దోషములు చేయువారు వాని యెదుటకు వచ్చుటకు భయపడి గడగడ వడంకుచుందురు. ఇట్లగుటచేత నతఁడు సర్వజనసులభుఁడు కాఁడనియుఁ గఠినస్వభావుఁడనియుఁ దలఁపగూడదు. అయన యందఱకు సులభుఁడు దయావంతుఁడు, తత్త్వజ్ఞుఁడు.

గోపాలరావు గొప్ప సంఘసంస్కర్తలలోఁ జేరినవాఁడు కాఁడు గాని వాని యభిప్రాయములన్నియు సంఘసంస్కారమున కనుకూలములుగానే యున్నవి. ఆయన మతమున సంస్కారము గావలసిన ముఖ్యవిషయములు నాలుగున్నవి. స్త్రీవిద్య దేశమునందు విశేషముగా వ్యాపింపవలయుననియు బాల్యవివాహము లడఁగిపోవలయుననియు నిర్బంధవైధవ్యములుండఁగూడదనియుఁ బ్రతివర్ణములోనున్న యంతశ్శాఖ లణఁగిపోవలయుననియు నాయన తలంచెను. అన్నిఁటిలో బాల్యవివాహమే మిక్కిలి నష్టకరమని యాతఁడు తలంచెను. అదియే హిందూసంఘవృక్షమును నాశనముచేయు వేరు పురుగు. అదియే వర్ణములో మిక్కిలి వ్యాపించియున్నదో యావర్ణము ననగా బ్రాహ్మణులను నానాటి క్షీణదశకుఁ దెచ్చుచున్నది. ఆ యగ్రవర్ణమున నీకాలమున జనించెడు బాలికాబాలకులు తమ పూర్వులట్లు దేహదార్ఢ్యము గలిగియుండక పొట్టివాండ్రై దుర్బలులై స్వల్పరోగములకైన నాగలేక యకాలమృత్యువుల పాలగుచుండుటచే నిట్టిదురాచారము ప్రప్రథమమున నివారింపఁబడవలసినదనియు నదియే సంస్కారములలోకెల్ల సంస్కారమనియు గోపాలరావు కంఠోక్తిగఁ జెప్పుచువచ్చెను. ఈనాటిబ్రాహ్మణులలో పడుచువాండ్రు మనఃపరిశ్రమమును గాని దేహపరిశ్రమము గాని చేయలేక చేసినమాత్రమున సొక్కి సోలిపోవుచుండుటయు పదునాఱు పదునేడేండ్లు వయసువారు గట్టిగా కృషిచేసి విద్యాభ్యాసము చేసిన బాలురు రోగులగుటయు నాతఁడు కన్నులార జూచి యిట్లు దలంచెను. ". వ్యవసాయముచేయువాఁడు తన విత్తులు మిక్కిలి మంచివై మందమశాగతులతో నేల సారముగలదై యున్నపుడె నాటును. బుద్ధిసూక్ష్మతగల హిందువుఁడు తనశరీరమునకీ పోలిక సరిపోవునని గ్రహింపలేకపోవుట మిక్కిలి యాశ్చర్యముగానున్న"దని యాయన చెప్పును. నిర్బంధవైధవ్యము పాపహేతువనియు దుస్సహమనియు గోపాలరావు మతము. బాలిక లకాలమున వితంతువులగుట కతిబాల్యవివాహమే ముఖ్యకారణమనియు నట్టివివాహములు బాలికాబాలకుల యిష్టములు బడయకుండఁ దలిదండ్రులే చేయుచుండుటచేత వధూవరు లుత్తరవాదులు కారనియు నాయన వాదించుచువచ్చెను. సంఘసంస్కారమందు గోపాలరావు నేటి విద్యాధికులలో ననేకులకంటె స్థిరాభిప్రాయములు కలిగియుండెను. దక్షిణహిందూస్థానమను నాకాశమండలమున సూర్యచంద్రమండలములవలె గోపాలరావు రంగనాథమొదలియారను వారిద్దరు నుదయించి చాలకాల మజ్ఞానాంధకారమును బారఁదోలి దేశస్థుల భాగ్యదోషమున నకాలమున నస్తమించిరి.

---

ఆయన కుమారునియొక్కయు వాని ప్రతికక్షియొక్కయు జాబుల నన్నిటిని జదివి బెంజామిను వ్రాసిన వ్రాతలు కొలిన్సువ్రాతలకు శబ్దమార్దవమున దీసిపోవు ననియు నభిప్రాయములు తేటతెల్లముగఁ దెలియుట లేదనియు విషయములు వరుసగా లేవనియు జెప్పి యాలోపము లెల్ల గొడుకుచేత నొప్పించెను. అట్లు దోషములు చెప్పి గుణములుకూడ జెప్పుట యుచితమని తండ్రి కుమారుని జాబులలో వర్ణక్రమదోషము లేదనియు వాక్యముల విరామములు సరిగా బడినవనియు నవి యచ్చుకూటమున బనిచేయుటవలన గలిగిన గుణములని చెప్పి మెచ్చుకొనెను. తనయందు లోపముల జూపించునప్పుడు మనసునం దీర్ష్యముబూనక యా లోపముల నివారించుకొనవలయునని బెంజామిను సంకల్పించి యానాడు మొదలు కృషిచేసెను. ఆకృషి యేవిధముగాఁ జేసెనో బెంజామిను నోటనే మనము వినవచ్చును. ఏలయన నాతఁడే యీక్రిందిమాటలతో దనపడినపరిశ్రమను వర్ణించెను.

"అట్లుండ స్పెక్టేటరను పత్రికాసంపుట మొకటి నాకు దొరకెను. ఆపుస్తక మెన్నడు నేను చూచియుండలేదు. దానిని వెంటనే వెలయిచ్చి కొని చదివి మరల చదివి మిక్కిలియానందము నొందితిని. అందలి శైలిమిక్కిలి బాగున్నదనితలంచి సాధ్యమగుపక్షమున నందలి శైలి ననుసరించి వ్రాయ సమకట్టితిని. ఈతలంపుతో నందలి పుటలు కొన్ని చదివి వాక్యములలోనున్న మంచియభిప్రాయములను వేరుకాగితముల మీద జ్ఞాపకార్థము వ్రాసికొని కొన్నిదినములు వానిమొగము మరల జూడక తరువాత కొన్నాళ్లకు పుస్తకము జూడకయే మొదట గుర్తుగా నిడికొన్నమాటల నాధారము చేసికొని నాబుద్ధికి బొడగట్టిన క్రొత్తమాటలతో వాక్యపూరణముం జేసితిని. అట్లు చేసి నా వ్రాసిన వ్రాత మాతృగ్రంథములోనున్న దానితోఁ బోల్చి చూచి నేనుగావించిన దోషములను దిద్దుకొంటిని. అప్పుడు నాయందు కనఁబడిన లోపము పదదారిద్ర్యము. అనగా నేస్థలమున నేపదము ప్రయోగింపవలయునో యది సమయమునకు స్ఫురణకు రాకపోవుట. మొదట నేను చెప్పదొడగిన కవిత్వ మిప్పటివఱకుఁ జెప్పుచుండినచో నాకీలోప ముండకపోవును. ఏలయన మనుష్యుఁడు కవిత్వము చెప్పునప్పు డంత్యనీమము నిమిత్త మనుకూలమగు పదముల యోచించి వెదకి ప్రయోగింపవలసియుండును. (ఇంగ్లీషుకవిత్వములో యతిప్రాసలుండవు. కొన్నిద్విపదలలో నున్నట్లు ప్రతిపాదమునం దంత్యనీమ ముండును.) అందుచేత నేను కొన్ని సంపుటములలోనుండి కొన్నికథలెత్తి పద్యములుగా వ్రాయనారంభించితిని.*** ఈపనులవలన నేను

చక్కని శైలితో నిగ్లీషు వ్రాయ నలవరుచుకొంటిని.''

అతఁడు పదునారేండ్ల ప్రాయముగలవాఁడై యుండగా నొకనాడు వానికి మఱియొక పుస్తకము దొరకెను. ఆ గ్రంథమునందు మాంసాహారముకంటె శాకభక్షణము మంచిదనియు ముఖ్యముగా నెల చౌకయగుటచే భోజనమునకు విశేష ధనవ్యయము కాదనియు వ్రాయఁబడియుండెను. అది చదివి బెంజామిను మాంసభోజనము విడుచుట జీవహింసం దొలఁగించుటయేగాక ధనలాభముఁగూడ కలిగించునని యదిమొదలు మాంసము వర్జించి కాయగూరలె తిన సంకల్పించి యన్నకడకుఁబోయి తన నిమిత్త మదివఱకు నెలనెలకగు భోజనపుఖర్చులో సగము మాత్రమె యీ నెల కిమ్మని యడిగెను. అన్న, తమ్మునికోర్కె మిక్కిలి సంతోషముతో నెరవేర్చెను. కాయగూరలలవరుచుకొన్న పిదప బెంజామిను తనకు సోదరుఁ డిచ్చెడు స్వల్పధనములో సగము మిగుల్చుకొనఁ గలిగెను. ఈసొమ్ముతో నతఁడు పుస్తకములుగొని చదువుకొనుచు వచ్చెను ఈపుస్తకములఁ జదువుట కతనికిఁ గావలసినకాలము కూడ సులభముగా గుదిరెను. ఎట్లన తనసోదరుఁడు తక్కిన పనివాండ్రు భోజనార్థము బసలకుఁ బోవుచుండ బెంజామిను తన యచ్చుకూటము విడువక యచ్చటనే యొకటిరెండు రొట్టెముక్కలం నాలుగుకూరముక్కలఁ దిని తక్కిన వారివలె భోజనానంతరము సారాయములను ద్రావక మంచినీళ్లుమాత్రమె త్రావి మితభోజనమువలన మనస్సు శరీరము చులకనగ నుండుంగావున దోటిపనివాండ్రు వచ్చువఱకు గ్రంథకాలక్షేపముఁ జేసి చదివినదంతయు నర్థము చేసికొని మిక్కిలి యభివృద్ధి గాంచెను. ఈభోజనకాలవ్యవధిలో నెతేలికభోజనములవలనఁ గలిగిన మనోనైర్మల్యముకతమున మున్నతఁడు బడిలోనున్నపుడెంతకష్టపడినను సాధ్యముకాని గణితశాస్త్రము సులభముగ దెలిసెను. గణితశాస్త్రముం జదివినపిదప నావికాయాత్రను గూర్చి వ్రాయఁబడిన యొక చిన్నపుస్తకమునుం బఠించి దానిసాయమున రేఖాగణితముం గూడ నేర్చికొనెను. అనంతరమతఁడు లాఖీ యనునతఁడు రచించిన మనుష్యులజ్ఞానగ్రహణము పుస్తకము మఱియొక వ్యాకరణములో జుట్టుతుదఁ గానఁబడిన యలంకారప్రకరణమును దర్కశాస్త్రసంగ్రహమును స్వయముగా నర్థము గ్రహించి చదువుకొనెను.

ఇతఁ డీగ్రంథములు ముగింపక మునుపె వాని సోదరుఁడు వృత్తాంతపత్రిక నొకదానిఁ బ్రకటింపఁ దొడఁగెను. అది యమెరికాఖండములో బయలుదేరినపత్రికలలో రెండవది. ఈప్రకటనమువలన నాయూరిలోనున్న విద్యావినోదు లందఱు

తఱచుగా నచ్చుకూటమునకు వచ్చుటయు వచ్చి పత్రికలలోఁ గనబడినవిషయములం గూర్చి ముచ్చటించుటయు మిక్కిలి బాగున్న కొన్నివిషయములం గూర్చి మెచ్చుటయుఁ దటస్థించుచువచ్చెను. బత్రికలకు వ్రాతలవ్రాసి పంపువారికి మంచికీర్తి వచ్చుచుండుటచే నట్టి కీర్తిఁ దానును సంపాదింపవలయునను నుత్సాహము గలిగి బెంజామిను తానుగూడఁ బత్రికలకు వ్రాయఁదలఁచెను. తలఁచి మొదట తన పేరు లోకులకు దెలియకుండ వలయునని నిశ్చయించుకొని దస్తూరిమార్చి వ్రాసి యొక కాగిత మచ్చుకూటము తలుపులోనుండి లోపలికి బడవైచెను. మరునా డచ్చుకూటమునకు వచ్చిన పెద్దమనుష్యు లాకాగితముఁ జూచి చదివి వ్రాసినవారెవరో యెఱుఁగకయె బెంజామినుయెదుటనె యావ్రాతను జాల మెచ్చుకొనిరి. అది పత్రికలోఁ బ్రకటింప బడెను. అది చదివినవారు బుద్ధిమంతులైన గొప్పవారెవ్వరో దానిని వ్రాసియుండవచ్చునని తలంచిరి వ్రాసినవ్రాత బాగున్నదని లోకులు శ్లాఘించుటచే నుబ్బి తాను వ్రాయగలిగి నన్నివిషయములమీఁద నతఁడు పత్రికలకు మారుపేరుతోనె లేఖలువ్రాసిపంపెను. అట్లుండఁ గొన్నినాళ్ళకు బెంజామిను బుద్ధికుశలతగలవాఁడని సోదరుని మిత్రులకుఁ దెలియవచ్చెను. వారు వాని తెలివి గనిపెట్టి ముందుముందు కాఁగలవాఁడని భావించిరి.

బెంజామిను సోదరునివద్ద పనిలోఁ బ్రవేశించునప్పు డతని కిరువదియొక్కయేండ్లు వచ్చువఱకు వానివద్ద నుండునట్లొడంబడికయె... అన్న తమ్ముని తెలివికి సంతోషించుటకుమారు విద్యాకీర్తి హెచ్చినకొలఁది వానియెడ నసూయదాల్చి మొదటనుండియు వానియెడ జూపుచున్న కాఠిన్యమును మఱింత హెచ్చించెను. బెంజామినుయొక్క యదృష్టవశమున సోదరుఁడు స్థాపించిన యా వార్తాపత్రికయే బెంజామినును సోదరునకిచ్చిన యొడంబడికయను బంధమునుండి తప్పించెను. ఆచిన్నపత్రికలో నమెరికా దొరతనము వారిమీఁద వ్రాయఁగూడని వ్రాతయేదో గానఁబడినందున దొరతనమువారు పత్రికాధిపతియైన బెంజామిను సోదరుని నెల దినములు చెరసాలకంపి కోపకారణమైన యాపత్రికను బ్రకటింపఁ గూడదని శాసించిరి అందుచేత బెంజామిను సోదరుఁడు కారాగృహ విముక్తుఁడగువఱకు పత్రికను దనపేరనేనడుప నిశ్చయించుకొనెను దొరతనమువారు తమ తలచినట్లు పత్రిక యడఁగిపోలేదనియు వెనుకటి పత్రికాధిపతియే దన చేతిక్రింద బనిచేయు కుఱ్ఱవాని చేతఁబ్రకటింపఁ జేయుచున్నాఁడు కాని నిజముగా పత్రికకుఁ గొత్తప్రవర్తకులు లేరనియుఁ దలంచి యపకారము చేయుదురేమోయను భయమున బెంజామిను తన చేతిక్రిందఁ

పనిచేయువాఁడు కాఁడని తెలియఁజేయుటకై సోదరుఁడు వాని యొడంబడిక పత్రము వానికిచ్చివేసెను. బెంజామిను దానిం బుచ్చుకొని తనమాటఁ దప్పకుండ నన్నగారివద్ద నిరువది యొకటవ సంవత్సరమువఱకుఁ బనిచేయఁదలఁచి వానికి రహస్యముగ మఱియొక యొడంబడిక పత్రము వ్రాసి యిచ్చెను. అది వ్రాసియిచ్చిన వెనుకగూడ ననేక మాసములవఱకు పత్రిక బెంజామిను పేరనే ప్రకటింపఁబడుచు వచ్చెను. అట్లుండఁ గొంతకాలమునకు వానికి వాని సోదరునకు మనస్పర్థలం బొడమ బెంజామిను సోదరుని బంధమునుండి తన్ను విడిపించుకొనఁ దలఁచి తాను రహస్యముగ వానికి వ్రాసియిచ్చిన రెండవ పత్రము నతఁడు పయికి దేలేఁడుగదా యను ధైర్యమున వానిపని మాని యావలకుఁ బోయెను. ఈవిషయమునుగూర్చి బెంజామిను తన స్వచరిత్రములో నిట్లు వ్రాయుచున్నాఁడు. "ఈవిధముగా నేను లాభమునొందుట నాకు న్యాయముకాదు. నాజీవితమందు నేను చేసిన మొదటి తప్పిదియే యని పరిగణించుకొంటిని. నాయన్న యీవిషయమున గాక నన్యవిషయమున దుస్స్వభావుఁడు గాకపోయిన నప్పుడప్పుడు నేను తెప్పించిన కోపముచేతను నాపెంకితనముచేతను గలిగిన మహోగ్రహముచేత నతఁడు నన్ను గొట్టిన దెబ్బలవలన నా యధర్మప్రవర్తనము సాకుఁగనఁబడలేదు."

ఈసాహసమువలన సోదరుఁడు బెంజామినుయొక్క నడత మంచిదిగాదని యెల్లరతోఁ జెప్పినందున బెంజామినున కాయూర నెవ్వరు నుద్యోగమిచ్చువారు లేరైరి. అందుచేత నతఁడు స్వగ్రామమగు బోస్టను విడిచి న్యూయార్కు నగరమునకుఁ బోయి యచ్చటనున్న మఱియొకరి యచ్చుకూటములోఁ బని సంపాదింపఁ దలఁచుకొనెను. ప్రయాణము కర్చులకు తన పుస్తకములఁ గొన్నిటి నమ్ముకొని యాతఁడు కొంతసొమ్ముఁ జేర్చి మిత్రులతోఁ జెప్పిన వారు తనకాటంకము కలిగింతురను భయమున పయనము వారికైన నెఱింగింపక యొక యోడ నెక్కిపోయెను. బోస్టను పట్టణమునకు న్యూయార్కు మూడువందల మైళ్ల దూరమునుండెను. మూడునాళ్లలో వాని ప్రయాణము ముగిసెను. నాలవనాఁ డతఁడు న్యూయార్కు బ్రవేశించెను. ప్రవేశించునప్పటికి వాని చేతిలో నెక్కువ డబ్బులేదు పరిచితులగు మనుష్యులు లేరు. పెద్దమనుష్యులకుఁ దన్నెఱిఁగించుటకు నెవ్వరిచ్చిన జాబులు లేవు. వయసుజూడ పదునేడవయేఁడు. గోరుచుట్టుపై రోకలిపోటు లన్నట్లీయవస్థకుఁ దోడుగ నతఁ డేమనుష్యుని యచ్చుకూటములోఁ బని చేయఁదలంచి వచ్చెనో యామనుష్యుఁడు తనవద్ద నప్పుడేపని ఖాళీలేదని

చెప్పెను. బెంజామిను పీచువిరిగి బెంగఁ గొనియుండగా నాయచ్చుకూటపు యజమానుడు తన కుమారుఁడు ఫిలడల్ఫియానగరములో ననగా నక్కడకు నూరుమైళ్ల దూరమున నొక యచ్చుకూటము స్థాపించినాఁడనియు వానివద్ద పనియుండిన నుండవచ్చుననియు వానికడకుఁ బోవుట యుచితమనియు హితోపదేశము జేసెను. అతిసాహసుఁడైన యీ బాలుఁడు క్రొత్తగా దగిలిన నూరుమైళ్ల ప్రయాణములో నెట్టిపాటులు పడెనో వననిక్కడ నెన్ననక్కరలేదు. గాని ఫిలడల్ఫియా నగరము నతఁ డేయవస్థలోఁ బ్రవేశించెనో వాని వలననే వినుట మంచిదని తద్విషయమును గూర్చిన వాని వ్రాత నీక్రిందఁ బొందుపరచెద.

"నేను ఫిలడల్ఫియాలో దిగునప్పుడు పనిజేయునప్పుడు వేసికొను దుస్తులతో నుంటిని. నా మంచిదుస్తులు వెనుక నోడమీఁద వచ్చుచుండెను. చాలసేపు పడవలో నుండుటచే నావస్త్రములు మలినములయ్యెను. నాజేబులు మేజోళ్లతోను చొక్కాయలతోను నిండి యుండెను. నే నెవ్వరి నెఱుఁగను. బస కెక్కడికి బోవలయునో నాకంతకు ముందే తెలియదు. నడకచేత నోడమీఁద తెడ్లు వేయుటచేత నిద్దురలేక పోవుటచేత నలసి మిక్కిలి శ్రమ గొనియుంటిని. నావద్ద నొక డాలరుండెను. (డాలరనగా రెండు రూపాయలన్నర.) ఒక షిల్లింగు నేబులుగూడ నదివఱకుండెను. "కాని నాకేవు క్రిందనది పడవవాని కిచ్చితిని, నేను కొంతసేపు పడవమీఁద తెడ్లు వేసినందున నావద్దపడవవాఁడు మొదట కేవు పుచ్చుకొనుట కిష్టపడలేదు. కాని నేనే బలవంతపెట్టి యిచ్చితిని, మనుష్యుఁడు తనవద్ద నెక్కువ ధనమున్నప్పటి కంటె స్వల్పధనమున్నప్పుడే యెక్కువ దయగలిగి దానముచేయును,, ప్రజలు తనవద్ద ధనము లేదనుకొందురను శంకచేతనే యిట్లు నరుఁడు చేయుచుండునని నేను తలంచెద. పడవదిగి యొకవీధి జేరి యీ వీధి చిట్టచివరకు ననగా బజారు కనఁబడువఱకు బోయితిని అక్కడ నొక కుఱ్ఱవాఁడు రొట్టెలమ్మ తెచ్చెను. కాల్చినరొట్టె తిను నలవాటు గలవాఁడనగుట రొట్టెలవాని యిల్లెక్కడ నని యడగి తెలిసికొని యక్కడకుఁ బోయితిని బోస్టను పట్టణములో జేయు మాదిరి రొట్టెలు కావలయునని యడిగితిని ఆమాదిరి యీ పట్టణములో జేయరఁట పిమ్మట మూడణాల రొట్టె నడిగితిని. అదియు లేదని చెప్పెను. ఆయూరిలోఁ జేయు రొట్టెల మాదిరియు వాని వెలయు నాకు దెలియకపోవుటచే మూడణాల విలువగల రొట్టె లిమ్మని యడిగితిని. అతఁడు మూఁడు పెద్దరొట్టెల నిచ్చెను. నాజేబులలో దాఁచుకొనుటకు చోటు లేనం

దున రెండు రొట్టెలు చెరి యొక చంక క్రింద బెట్టుకొని మూడవ రొట్టె దినుచు నడవసాగి నాలవ వీధినిండబడిపోయి నాకు భవిష్యత్కాలమున మామ యగు రీడ్డుగారి గృహ సమీపమున నుండి నడచి పోతిని. అప్పు డా యన కూఁతురు నాభవిష్యద్భార్యయగు చిన్నది నా వికృతవేషముఁ జూచి నవ్వ కొనెను. తరువాత నా రొట్టె దినుచు రెండుమూడు వీధులు తిరిగి దాహముత్రా గవలసి నేను పడవదిగిన రేవునకుఁ బోతిని. ఒకరొట్టెతో నాకడుపు నిండినందున తక్కిన రెండురొట్టెలు నే నెక్కినపడవలో నేఁచ్చి యింకఁ జాఁదూరము పోవఁదలఁచి కుమారునితోఁ గలిసి యాహారములేక యిబ్బందిపడుచున్న యొకస్త్రీ కిచ్చితిని దాహ ముత్రాగి సేదదేరి యావీధినే బడి నేను మరల నడువసాగితిని అప్పుడు జనులనేకులు నీటుగు వేషములతో బయలుదేరి పోవుచుండిరి. నేను వారితోఁ గలిసి నాకు జనుగ బోవు మతసంబంధమైన యొకసభకుఁ బోయితిని. పడవలోఁ గడచినరాత్రి నిద్దుర లేనందున నే నక్కడకుఁ బోయినదిమొదలు సభ ముగియువఱకు నొక్కవరసనే నిద్రించితిని. సభాంతమున దెవ్వఁడో దయగలిగి నన్ను మేలుకొలిపెను. ఫిలడల్ఫియా నేను మొదట బ్రవేశించిన గృహము నిద్రించినగృహము నదియే యని చెప్పవచ్చును॥

ఈవిధముగా నతఁడు కొంతసేదదేరి రాత్రి నిద్రించుటకు బస వెదకికొనుచు బయలుదేరను. ఆరాత్రి యెచ్చటనో బండుకొని యతఁడు మఱునాఁ డుదయమున నెవనివద్ద బనిచేయఁదలఁచి వచ్చెనో వానికడ కరిగెను ఆయన బెంజామినును జూచి తనవద్ద పనిలేదని చెప్పెను. ఐనను బెంజామిను ధైర్యము విడువక కేమర్ యను మఱి యొక ముద్రాయంత్రాధికారియొద్దకుఁబోయి పనియడుగ నతఁడు దయతలఁచి శిథిల పడిన ముద్రాయంత్ర మొకటి బాగుచేయుమని చెప్పెను. అది చక్కఁజేసినతోడనే యాతఁడు బెంజామినునకు నుద్యోగమిచ్చెను ఈపనిలో నతఁడు కొన్నిమాసములుం డునప్పటి వాని తల్లిదండ్రులు చుట్టములు వానిజాడ యేమియుఁ దెలియక కళవళము పడిరి. ఆతనిబావ యొకఁడు వర్తకుఁడై తన యోడపయనములలో నెక్కడనో మఱది ఫిలడల్ఫియాలో నున్నవాఁడని విని బోస్టనుకు బోయి బెంజామినును బతిమాలుచు నక్కడకు రమ్మని జాబు వ్రాసెను. బావకు బెంజామిను మరల నుత్తరము వ్రాసెను. ఆ బావ యాదేశపు గవర్నరగు సర్ విలియముకీతుతో గలిసి కూర్చుండి మాటాడు చుండ మరది వ్రాసిన యుత్తరము వానికందెను. అందుటయు నతఁడు గవర్నరు కాలేఖ జూప గవర్నరు వ్రాసినవానివయసును బట్టి చూడ శైలి మిక్కిలి మనోహ

రముగా నున్న దని యాశ్చర్యపడి యతఁడు ముందుముందు జాల నభివృద్ధికి రాఁగలఁడని యభిప్రాయపడి ఫిలడల్ఫియాలో నున్న యచ్చుకూటపు బనివాండ్రు తెలివి మాలిన వాండ్రనియు బెంజామిను స్వయముగా నచ్చుకూటము స్థాపించి పని నుపక్రమించినచోఁ జాల బాగుండుననియు గవర్నమెంటువారి యచ్చుపని నంతయు దాను వానికేయిచ్చి చేతనైన సాయము జేయుదుననియు జెప్పెను. గవర్నరునకు బావకు జరిగిన సంభాషణము బెంజామి నెఱుఁగడు.

ఒక నాఁడచ్చుకూటమున నతఁడు యజమానునిం గలిసి పని జేయుచుండ గవర్నరగు విలియంకీతూ కర్నల్ ఫ్రెంచియను మఱియొకనిం గలిసి వారి కార్యస్థానము వంక నడిచి వచ్చుచుండెను. అప్పుడు యజమానుఁడు కేమరు తన నిమిత్తము గవర్నరు గారు వచ్చుచుండి రనుకొని పరుగు పరుగున నెదురుగాబోయి సన్మానించి లోనికిందోడ్కొని పోయెను. గవర్నరు వానితో సరిగా మాటాడక బెంజామిను యెక్కడ నున్నాఁడని యడిగి తెలిసికొని వానికడకుబోయి యెంతో మృదువగు సంభాషణతో వానితో బ్రసంగించి యింతకాలము నుండి తనవద్ద కొకసారియైన రాకపోయినందుకు దయా పూర్వకముగ గూకలువేసి యాదరించి విందునకు బిలిచి వెంటబెట్టుకొని పోయెను. కేమరు మిక్కిలి యాశ్చర్యపడెను. గవర్నరు స్వయముగా వచ్చి దర్శన మిచ్చుటచే బెంజామిను గూడ మిక్కిలి యక్కజపడెను.

పూర్వోదాహృతమైన విషయము జదివినవారికి గవర్నరగు విలియము చిత్ర స్వభావము కలవాఁడని తోఁచకపోదు. ఇఁక ముందు జెప్పబోవు కథవలన నతని స్వభావ మట్టిద యని దృఢపడును. అట్లు బెంజామినును గవర్నరు విందునకుఁ గొని పోయి భోజనసమయమున బెంజామినుతో నిట్లనియె. బోస్టనునకుఁ బోవుటకు నీకు దారిబత్తెము దొరకగానే నావద్దనుండి యొకజాబు తీసుకొని మీతండ్రికడకుఁ బోయి నీవు స్వయముగా ముద్రాయంత్రము స్థాపించి పనిచేసుకొనుటకుఁ గావలసిన పెట్టుబడి సొమ్ము తెచ్చుకొనుము. నావద్దనుండి నీవు జాబుతీసుకొని పోయినయెడల మీతండ్రి నీకు తప్పక సొమ్మిచ్చును. అంతవఱకు కేమరువద్దనే యుండి నీవు పనిచేసుకొనుచుండుము " ఆయుపదేశము లెస్సయనుకొని బెంజామిను స్వల్పకాలములోనే యోడ యెక్కి బోస్టనుకుఁ బోయెను. అన్నతప్ప తల్లిదండ్రులు మొదలగు నాప్తులందఱు వాని రాకకు మిక్కిలి సంతసించి వానిం గారవించిరి. గవర్నరు తనకుఁ జాబువ్రాసినందుకు మిక్కిలి యాశ్చర్యమునొందుచు దన తండ్రి వానిజాబును జదువుకొనెను, తండ్రి

కొన్ని నాళ్లవఱకు బెంజామిను వ్యాపారముమాటయే దలపెట్టక తరువాత నా ప్రసంగము వచ్చినప్పుడు పూర్ణవయస్సురాని పదునేడేండ్ల బాలునిచేత ధనము పెట్టుబడి పెట్టించి స్వయముగా వ్యాపారముఁ జేయింపఁదలఁచుటచే గవర్నరు మంచి యాలోచనలేని వాఁడని యభిప్రాయపడుచు వచ్చెను. బెంజామిను తనవచ్చిన పని మాట తండ్రినొత్తి యడుగ తానా వ్యాపారమునం దేవిధమైన జోక్యముఁ గలుగఁ జేసికొనుట లేదని తండ్రి స్పష్టముగఁ జెప్పెను బెంజామిను తలిదండ్రులవద్ద సెలవుఁ గైకొని తన యపజయమును దన యంతు మహాభిమానముగల గవర్నరునకు విన్నవించుటకై ఫిలడల్ఫియాకుఁ జనెను తలిదండ్రులు వానికోరిన సాయము జేయకున్నను ఫిలడల్ఫియాలోఁ దను కుమారుఁడు పాలుమాలిక లేక పాటుపడుచుండెనని విని మరల నక్కడికే బోయి పనిచేసుకొమ్మని సెలవిచ్చిరి.

ఆయన యనుగ్రహించి దయచేసిన జాబు నిరర్థకమైనదని బెంజామిను విన్నవించినతోడనే గవర్నరు "అవును ఆయన పెట్టుబడి పెట్టఁడు నేనే పెట్టెద" నని యక్షరములు ముద్రాయంత్రములు మొదలగునవి కొనుటకు బెంజామిను నింగ్లాండునకుఁ బొమ్మని దానికిఁ గావలసిన సొమ్ము నూరుపౌనులు తాను మూలధనముగా నీయఁదలఁచి యింగ్లాండులో కొందఱు పెద్దమనుష్యులకు సొమ్మునిమిత్తము బరాతమీయ సమ్మతించెను. వాగ్దత్తములైన బరాతపుజాబులనిమిత్తము బెంజామిను గవర్నరున కనేకదరఖాస్తులు పెట్టుకొనఁగా నెట్టకేలకు గవర్న రింగ్లాండుబోవు నోడమీఁద వాని నెక్కఁబనిచి కర్నలు ఫ్రెంచియను నతఁడు బరాతపు జాబులు పట్టుకొని వచ్చునని తెలియఁ జేసెను కొంతసేపటికి ఫ్రెంచియను నతఁడు జాబులకట్ట యొకటి తెచ్చి వానిబరాతములందున్న వని చెప్పెను. ఆయోడ యింగ్లాండు సమీపమునకు బోయినతోడనే గవర్నరంపిన జాబులకట్టలో దనలేఖలు కొన్నియున్నవని బెంజామిను నావయధికారితో జెప్ప నతడు వానియుత్తరములను వెతికి పుచ్చుకొనవచ్చునని చెప్పెను. కొన్ని జాబులు నావయధికారిపేరనే యుండెను. అవియన్నియు దనసంబంధములే యనుకొని బెంజామిను భ్రమపడియెనే గాని యవి తనవి కావయ్యెను. వెతుకగా వెతుకగా నందొకజాబు కాగితములు కలములు ముద్రాక్షరములు మొదలగువాని నమ్మెడు వర్తకునిపేర వ్రాయబడియుండెను ఆజాబు బెంజామిను వానికిజూప నతడది చదువుకొని యిట్లనియె. "ఓ ఈజాబు రిడిలిసిడన్ వద్దనుండియా! వాడు బల్ తుంటరని యీనడుమనే తెలిసికొంటిని." రిడిలిసిడన్ ఫిలడల్ఫియాలోనున్న యొకవకీలనియు వాఁడు నమ్మదగ

ని యిచ్చెదనియు బెంజామిను సయితమెఱుఁగును. "గవర్నరు తాను స్వయముగ జాబులు వ్రాయక పరపతులేని యా నిర్భాగ్యుని చేత వ్రాయించి యుండునో?" యని యా వర్తకుఁడు బెంజామినుతోఁ జెప్పి వానిజాబు వానికిచ్చి తనపని జూచుకొన సాగెను.

ఆమాటలు వినినతోడనే బెంజామినునకు తన కాప్తుఁడైన గవర్నరుమీఁద నమ్మిక మించుకతగ్గ నతఁడు ధైర్యముఁబూని తనయవస్థ విచారించుకొని నోడమీఁద తనతోఁ గూడ పయనము చేసి తనయందతిస్నేహముఁ జూపిన యొకవర్తకున కాజాబు జూపి కర్తవ్యమును గూర్చి వానితో నాలోచించెను.

ఆమిత్రుఁడు తత్క్షణమె వాని సందేహము బాపెను. ఆమిత్రుఁడు పలికిన పలుకులు యీవిధమున బెంజామిను వర్ణించెను. "సర్ విలియంకీతుయొక్క నడత నా కతఁడెఱిఁగించెను. నా నిమిత్త మాయన యొక్కజాబైన వ్రాసియేయుండఁడనియు వాని నెఱిఁగినంతవఱకు వాని నెవ్వఁడు నమ్మఁడనియు నాతోఁ జెప్పి. నీవు బరాతమిచ్చుటకు వానికి పరపతున్నదా యని నవ్వెను."

ఇట్లు మఱియొకసారి నిరాధారుఁడై యీసాహసుఁడు లండనుపట్టణములో జీవనోపాయమేదియు లేక యేపనినైన సంపాదించుకొని జీవింపఁ బ్రయత్నింపఁ దలఁచెను. తలఁచి పామరను పేరుగల యొక యచ్చుకూటపు యజమానుని దర్శనముఁ జేసి యుద్యోగమడుగ నతఁడు వాని కొక యుద్యోగ మిచ్చెను. ఆ యచ్చుకూటమున బెంజామిను సంవత్సరముండెను. ఆయచ్చుకూటములో నున్న మఱియొక పనివాని సహవాసమువలన బెంజామినునకు కొంతసోమరితన మబ్బినను నతఁడు తన తొల్లింటి విద్యాభ్యాసము బొత్తుగవదలక నప్పుడప్పుడు కృషిఁజేయుచుండెను. అతఁడుపనిచేయు నచ్చుకూటము ప్రక్కనే యొకపుస్తకముల యంగడి యుండెను. ఆయంగడిలో ననేకనూతనగ్రంథములుఁ గొన్ని ప్రాఁతపుస్తకములు విక్రయ నిమిత్తముండెను. బెంజామిను పుస్తకముల యందధికాసక్తి కలవాఁడగుటచే నంగడివానితోఁ గొన్ని పద్ధతుల నేర్పరచుకొని తనకుఁ గావలసిన పుస్తకముల నెరవు దెచ్చుకొని యా గ్రంథములం జదువుచు తీరికయున్న కాలము గడుపుచుండెను.

లండనులో నొక గ్రంథకర్త 'ప్రకృతిమత' మనుపేర నొక గ్రంథమును వ్రాసి యచ్చొత్తించి మొదటికూర్పనఁ బడిన పుస్తకములన్నియు విక్రయింపబడినందున దానిని రెండవసారి ముద్రింపింపఁ దలఁచి బెంజామిను పనిఁజేయు నచ్చుకూటమున నిచ్చెను. ఆపుస్తకమును గూర్చునపుడు బెంజామిను దానిని జదివి యా గ్రంథకర్త వ్రాసినయ

క్తులు తన మనంబునకు సరిగా నుండకపోవుటచే వాని వాదముల ఖండించుచు నొక చిన్నపుస్తకము వ్రాసి యచ్చొత్తించి ప్రకటించెను.

ఈచిన్నపుస్తకమును బ్రకటించుటవలన విద్వజ్జనమండలములో బెంజామిను కీర్తి కొంతవ్యాపించెను. మాండవిల్లి పేంబర్టను మొదలగు నాంగ్లేయ గ్రంథకర్తలు పండితులు వానికిఁ బరిచితులైరి. ఈపెంబర్టనుఁ మహాగణితశాస్త్రవేత్తయై సుప్రసిద్ధిఁగాంచిన సర్ ఇజయాల్ న్యూటనను వానికి మిత్రుఁడైనందున నామహాత్ముని దర్శనము జేయించునట్లు బెంజామినునకు వాగ్దానము చేసెను. కాని యది యెన్నఁడు జరుగలేదు.

ఆకాలమున లండను నగరములో సర్ హాన్సుస్లోనీయను నొక గొప్ప పురుషుఁడుండెను. అతఁడు లండను మ్యూజియము స్థాపించిన సుప్రసిద్ధుఁడు. (మ్యూజియము అనగా చిత్రవస్తుశాల) స్లోనీ తనమ్యూజియమునిమిత్తము వేలకొలఁది చిత్రవస్తువులను బోగుచేసినవాఁడు. బెంజామిను స్వదేశమునుండి కొన్నిచిత్రవస్తువులం దెచ్చినాఁడనివిని స్లోనీ వానిపరిచయముఁజేసి యమెరికానుండియతఁడు తెచ్చిన మిక్కిలి చిత్రమైనరాతి నారసంచిని వానివద్దకొని మ్యూజియములోఁ బెట్టెను. అట్లు పామరువద్ద కొంతకాలముండి బెంజామినుం పిమ్మట కొన్నాళ్లు వాట్సువద్ద బనిజేసెను. అక్కడనున్నపుడు నిక్కడినున్నపుడుఁగూడ నతఁడుమద్యపానము వర్జించి పాలుమాలక పాటుపడుచు మితవ్యాయామముఁ జేసికొనుచు సత్ప్రవర్తనగలిగి కాలముఁబుచ్చెను. ఈసద్గుణములే యంత తక్కువస్థితిలోనుండి బెంజామినును తరువాత మిక్కిలి గొప్పస్థితిలోనికిఁ దెచ్చెను. వాట్సువద్దనున్న పనివాండ్రందఱుఁ బ్రతిసాయంకాలము గిడ్డంగులకుఁ బోయిబీరుసారాయి త్రాగుచుండువారు. బెంజామిను వారి దాహంబోక దాహమైనప్పుడు మంచినీళ్లు త్రాఁగి వారికంటె నెక్కువ బలముఁగలిగి యెక్కువ నిర్మల మనస్సుగలిగి చాకచక్యముతోఁ బనిచేసుకొనుచుండును. తనతోడి పనివాండ్రం గూర్చి బెంజామిను తనచరిత్రములో నిట్లు వ్రాయుచున్నాఁడు.

'నావిధముఁజూచి వారిలో ననేకులు బీరు సారాయి రొట్టె జున్నుకలసిన భోజనమును నూని పొరుగింటివారివద్ద మనుపొక్క సారాయినిమిత్తము కర్చుచేసెడు మాడణాలకే కంచెడు వేడిగంజి రొట్టె మొదలగు పదార్థములతోఁ గలసిన యాహారము దినసాగిరి. ఈభోజనము మిక్కిలి యనుకూలముగా నుండుటయెగాక చౌకయై తలలకు మత్తెక్కింపక మనస్సులను నిర్మలములుగఁజేసెను. బుద్ధిచెడిసారాయంగడి వద్దనే దినమెల్ల దిరుగులాడు వారు ప్రాఁతబాకీలు చెల్లించక పోవుటచే దుకాణమువద్ద తమ

పరపతుబోవ నావస్థనువచ్చి "దీపమారిపోయినది దీపమారిపోయిన"దనివడ్డీ యిచ్చిసొమ్ము బదులుతీసుకొని పోవుచుందురు. ప్రతిశనివారము రాత్రియందు జీతములు వచ్చునప్పుడు నేను జీతముల బల్లవద్దఁ గనిపెట్టుకొనియుండి పనివాండ్రనిమిత్తము నేను ప్రూచీపడి గిడ్డంగికివ్వవలసిన సొమ్ము వారిజీతములలోనుండి యిచ్చివేయుచుందును. ఒక్కొకసారి యీవిధముగా వారమునకు ముప్పది షిల్లింగులియ్యవలసి వచ్చెను. నేనెప్పుడు పని మానక ననుదినము సరిగా వచ్చుటచేతను కూర్పులో నసాధారణశక్తి కలవాఁడనగుట చేతను యజమానుఁడు నాయందు మిక్కిలి యిష్టముగలిగి యెక్కువ రాఁబడికల సరుకులు పంపునట్టి పనిలో నన్ను నియోగించెను. మొత్తముమీఁద నేను వానికి మిక్కిలి యిష్టుఁడనయితిని."

బెంజామిను లండనులోఁ బదునెనిమిదిమాసము లుండెను. ఆకాలములోనతఁడు మిక్కిలి కష్టపడి పనిజేసి సంపాదించుకొన్న ధనములోఁ గొంత కొన్ని నాటకముల జూచుట నిమిత్తము గ్రంథములఁ జదువుట నిమిత్తముమాత్రము వ్యయముఁ జేయుచుఁ దక్కినదానిని నిలువఁజేసెను. ఫిలడల్ఫియానుండి మొదట నతనితో నోడపయనము జేసిన డెనహాము నతఁ డొకనాడు బెంజామినును గలిసికొని తాను మరల ఫిలడల్ఫియా పోవలసివచ్చెననియుఁ బోయి యచ్చట సరుకులనిలవకొట్టు పెట్టఁదలఁచెననియుఁ గొట్టుమీఁద సంవత్సరమున కేఁబదిపౌనుల జీతముమీఁద గుమస్తాగా వానిని వేయఁ దలఁపుకలదనియుఁ జెప్పెను.

బెంజామిను లండనులో నచ్చుకూటమునందుండి యేఁడాది కేఁబదిపౌనులకంటె నెక్కువసంపాదించుచుండినను స్వదేశముపైధ్యానముపారుటచే నతఁడాతక్కువజీతము గలయుద్యోగమునే స్వీకరించెను. అనంతరము బెంజామిను డెనహాము గలిసియోడయెక్కి దీర్ఘప్రయాణము జేసి **1726** వ సంవత్సరము **11** అక్టోబరు తారీఖున ఫిలడిల్ఫియాలో దిగిరి. అప్పటికి బెంజామినున కిరువదియొకటవ సంవత్సరము. ఓడమీఁదనున్నప్పు డతఁడు తానటుతరువాత నేధముగా జీవయాత్ర జరుపదలచుకొనెనో యావిధమంతయు నొక కాగితముమీఁద సమగ్రముగా వ్రాసికొనెను. కష్టపడివ్రాసిన యాకాగితము దైవవశమున నెక్కడనో పోయెను. పోయినను దానిలోనివిషయములను జ్ఞాపకముంచుకొని బెంజామిను యావజ్జీవము నించుమించుగ దాని ననుసరించియే ప్రవర్తించెనట. డెనహాము వాణిజ్యము మొదలుపెట్టిన కొన్నిదినములకే మృతినొందెను. ఉద్యోగము లేకపోవుటచే బెంజామినుస్థితి మరల మొదటికివచ్చెను. అప్పుడు బెంజామిను తనపూర్వయజమా

నుఁడగు కేమరువద్దకుబోయి పని సంపాదించుకొనెను. కేమరు మునుపటికంటె మంచి యిల్లుసంపాదించి మంచియక్షరముల సంగ్రహించి యుండెనుగాని పనిజేయుట యెట్లో యెఱుఁగక యుండెను.

ఇక్కడనున్నపుడు బెంజామిను తనవలెవిద్యాసక్తులగు పురుషులతో స్నేహము చేసి శనివారమునాఁడు యజమానుఁడు సెలవిచ్చుచుండుటచే నాదినమునిమిషమైనను వ్యర్థము సేయక వారితోఁగూడియనేకగ్రంథములుచదువుచువచ్చెను. చురుకుగా బనిచేయుటయు విద్యావ్యాసంగమునఁ గాలముపుచ్చుటయుఁగాక వానివద్దనింక నెన్నో సుగుణములు నెన్నో ప్రజ్ఞలునుండెను. ఈయచ్చుకూటముననుండగా వాని నేర్పు నూతనవస్తునిర్మాణ చాతుర్యము వెల్లడియగుటకుఁ దగిన యవకాశముఁ గలిగెను. అదివఱకమెరికాలో నచ్చుకూటము లెన్నియో నుండెనుగాని యక్షరములఁ బోతపోయునట్టి యచ్చులు దిమ్మలు లేవు. అందుచేత ముద్రాయంత్రాధికారులు తమకుఁ గ్రొత్తయక్షరములు కావలసినప్పుడు మిగుల వ్యయప్రయాసలకు లోనై లండనుపట్టణమునుండి తెప్పించుకొనవలసివచ్చెను. బెంజామిను లండనులోనున్నపు డక్షరములఁ బోతపోయు చట్రములు జూచినవాఁడగుటచేఁ బ్రత్యేకముగా నావిద్య నేర్చికొనకపోయినను నేర్చికొన్నవాఁడవోలె స్వబుద్ధి సహాయమున నొక చట్రముఁజేసి సీసముతో నక్షరములఁ బోతఁబోసి తనయజమానున కిచ్చుచువచ్చెను. ఆయక్షరములు మొత్తముమీఁద బాగుగానుండెనని చూచినవా రభిప్రాయపడిరి. అంతియెగాక బెంజామిను గీతలబొమ్మలఁ జెక్కుట యచ్చుపేయు నప్పు డుపయోగించు సిరాజేయుట మొదలగు విన్నాణములగు పనుల స్వయముగఁ గనిపెట్టి చేయసాగెను. బెంజామిను కేమరుయొక్క కొలువులోఁ జాలకాలముండలేదు. ఏలయన గడుసరియగు కేమరు బెంజామినును దనకొలువున జిరకాలముంచఁదలఁపక తనవద్ద మునుపున్న పనివాండ్రందఱు వానికడపని నేర్చికొనునంతవఱకు వానినుంచఁదలఁచి తన మనోరథము నెరవేరినతోడనే బెంజామినుతో నేదో కయ్యము పెట్టుకొని వాని నావలకు బొమ్మనెను.

బెంజామినుతోఁగలిసి యచ్చుకూటమునఁ బనిఁజేసినవారిలో మెరిడిత్తను నొకఁడుకలఁడు. అతనికి భాగ్యవంతులగు మిత్రులుండిరి. వారు సొమ్ము పెట్టుబడి పెట్టుటకంగీకరించి వేరొక యచ్చుకూటము ఫిలడల్ఫియాలోఁ బెట్టుమని మెరడిత్తునకు బురికొల్పిరి. మెరిడిత్తు తనతోఁగలిసి పనిచేయుమని బెంజామినునడిగెను. సొమ్ము పెట్టుబడి మెరిడిత్తు పెట్టునట్లు పెట్టుబడి యక్కఱలేక పనిమాత్రమె బెంజామిను చేయునట్లు

వారికొక యొడంబడిక జరిగెను. అట్లు వారిరువురుం గలిసి పనిచేసికొనుటకుం బ్రయ
త్నములం జేయుచుండఁగా మఱియొకసారి కేమరు వానివద్దకుఁబోయి న్యూజర్సియను
మండలము దొరతనమువారివద్ద తాను కొంతపని యొప్పుకొనెననియు నట్టిపనికిఁ గొన్ని
క్రొత్తదిమ్మలు క్రొత్తమాదిరి యక్షరములు గావలసియుండెననియు నవి బెంజామినువల్లనే
గాని యితరులవల్ల కావనియు జెప్పి బ్రతిమాలి యాపని బర్లింగుటన్ పట్టణములో జరు
గవలసియుండుటచే నక్కడకు బెంజామినును గొనిపోయెను.

ఆపట్టణమునసున్న మూడుమాసముల కాలములో బెంజామిను తనచేయు పని
సంబంధమునఁ దనవద్దకువచ్చిన తగుమనుష్యులతో మాటలాడి సహవాసముఁ జేయు
టచే మృదుసంభాషణము మరియాదలు గొప్పవారి సదనముల నుండవలసిన రీతులుఁ
గొన్ని నేర్చికొనెను. అట్లు బెంజామిను కలిసికొన్న మనుష్యులలో నొకడు డికో
యనునతఁడు. ఆయన సర్వేయరు జనరలుగానుండిన గొప్పయుద్యోగస్థుఁడు. ఈయన
బెంజామినుతో నొకసారి మాటలాడుచు తాను మొట్టమొదట నిటికలు పట్టువారికి
మట్టిముద్ద లందిచ్చుచుండెననియు వయసు ముదిరిన తరువాతకాని చదువుకొనలేదనియు
ననంతరము కొన్నాళ్లు సర్వేపిపార్టుమెంటు నుద్యోగస్థులకు గొలుసులు మోయవలసి
వచ్చెననియు స్వచరిత్రమును జెప్పి వెండియు నిట్లనియె. "నీవు కేమరువద్ద పని మాని
ఫిలడల్ఫియాలో వేరుపని పెట్టుదువేని గొప్పవాఁడవయ్యెదవు". "నేను కేమరు
నుండి విడిపోయి ప్రత్యేకముగా వ్యాపారముఁ జేయఁదలంచినమాట డికో బొత్తుగా
నెఱుఁగకయె దైవవశమున నిట్లు ప్రసంగించె" నని బెంజామిను తన చరిత్రమున
వ్రాసెను.

అంతకు మెర్డిత్ లండనునుండి ముద్రాయంత్రములు క్రొత్త యక్షరములు తమ
వ్యాపారమునిమిత్తముఁ దెప్పించి యుండుటచే బెంజామిను ఫిలడల్ఫియాకు వచ్చిన
పిదప కేమరు తన కివ్వవలసిన సొమ్ము పుచ్చుకొని మెర్డిత్తుతోఁ గలిసి పని నారంభిం
చెను. ఆపనివాండ్రిద్దఱుఁ దమయక్షరముల సర్దుకొని ముద్రాయంత్రము నమర్చుకొని
పనిఁజేయుటకు సిద్ధముగ నుండినతోడనే వారిపరిచితుఁడు జార్జి హౌసనువాఁడు
పల్లెటూరినుండి యేదో యచ్చువేయించుకొనుటకు వచ్చిన యొకమనుష్యుని వెంటబె
ట్టుకొనిపోయి బెంజామినునకు వాని నప్పగించెను. చేతనున్న సొమ్మంతయు ముద్రా
యంత్రము నిమిత్తము వ్యయమైపోయినందున నాపల్లెటూరివాఁడప్పుడిచ్చినయైదుషిల్లిం
గులు వారికెంతో సమయమున కక్కరకువచ్చి కనకాభిషేక మట్లుండెను. అది మొద

లుకొని బెంజామిను క్రొత్తగా వ్యాపారము పెట్టుకొన్న వారికి సొమ్మెంతో యవసరముండునో యెఱింగి చేతనైనసాయము యావజ్జీవముఁ జేయుచువచ్చెను. స్వానుభవము చేత నే గదా మనుష్యుల కితరుల కష్టసుఖములు తెలియుట ! మఱుసటిసంవత్సరము బెంజామిను తనవంటివారిఁ గొందఱఁ జేర్చి పరస్పరాభివృద్ధికై యుపన్యాసములు చర్చలుఁ జేయుట కొకసంఘము నేర్పరచెను. ఆసంఘమునకు వారు జెంటో యనిపేరు పెట్టిరి. ఆసంఘములోఁ జేరినవారు ప్రతిశుక్రవారము కలిసి విద్యాగోష్ఠిం గాలము బుచ్చుచువచ్చిరి సంఘస్థులందఱును బెంజామినుమీఁద నభిమాన ముండుటచే వారెక్కడెక్కడనున్న యచ్చుపని దెచ్చి వాని కిచ్చుచు వచ్చిరి.

ఆదేశమున క్వేకరులను నొకతెగ క్రైస్తవులు కలరు. ఆమతస్థులు నలువదిపుటలుకల తమ మతచరిత్రము సంఘపుసొమ్ము పెట్టి యచ్చువేయింపఁదలఁచి బెంజామినున కాపని యిచ్చిరి. మెర్డిత్తు బెంజామినును దాని నచ్చువేయుటకు మిక్కిలి శ్రమపడిరి. ఏలయన మిత్రులు తరుచుగా నచ్చుపనులఁ దెచ్చి తను కప్పగించుచుండుటచే నీపుస్తకముద్రణ మాలస్యమగుచుండెను. అందుచేత బెంజామిను రాత్రి రెండుజాములవఱకుఁ గష్టపడి కూర్చుచు వచ్చెను. మెర్డిత్తు ముద్రాయంత్రముకడనుండి యచ్చువేయుచు వచ్చెను. ఒక్కొక్కరాత్రి మఱునాఁడుదయము పని సాగుటకై కూర్చినయక్షరముల విడగొట్టుకొనుచు బెంజామిను రెండుజాములకంటె నెక్కువసేపు గూడ మేలుకొనవలసివచ్చెను. మొత్తముమీఁద నతఁడు దినమున కొక్కటావు కాగితము కూర్చుచువచ్చెను. ఒకనాఁడు సాయంకాల మతఁడు సరిగా నొకటావు కాగితము కూర్చి పనిముగిసెనని సంతోషించి పెందలకడ నింటికి బోవఁదలఁచుచుండ కూర్చినదానిలో సగము చెదిరిపోయెను. అప్పుడు బెంజామిను విసుగుకొని యింటికిఁబోక మఱునాఁడుదయమున జేసికొనవచ్చుననక తత్క్షణమే జారిపోయిన రెండుపుటలగ్రంథముఁ గూర్చి యనంతర మింటికిఁబోయెను. ఇరుగుపొరుగువారు వాని పరిశ్రమను కన్నులారఁ జూచినవారై యాపనివాండ్రనిద్దఱ శ్లాఘింపఁ జొచ్చిరి. అందువలన వారికి మంచిపేరు వచ్చెను. పేరువచ్చినతోడనే విశేషముగాఁ బని కలుగుటయేగాక వారికిసొమ్ము పెట్టుబడి పెట్టుటకుఁగూడ కొందఱు సమకట్టిరి.

అట్లు జనసమ్మతమైన వర్తనముఁ గలిగియుండుటచే నాపనివాండ్రు వార్తాపత్రిక నొకదానినిఁ బ్రకటింపఁ గృతనిశ్చయులైరి. బెంజామిను తనతలంపు మనసులో దాఁచుకొనక తనకడకు పనినిమిత్తము వచ్చిన యొకపరిచితున కాయాలోచనమెఱిఁగించెను.

వాఁడదివఱకు కేమరువద్ద పనిఁజేసినవాఁడు కావున వెంటనే పోయి తనయజమానునకావార్త నెఱిఁగించెను. కేమరు బెంజామినుకంటె ముందు తానే యొకవార్తాపత్రిక పెట్టినచోఁ దనకెక్కుడు లాభముండునని యూహించెను. కేమరు తనకుఁ జేయఁదలఁచిన యాద్రోహమునకు బెంజామిను చిత్రమైన ప్రతిక్రియఁ జేసెను. ఆయూరిలోనదివఱకే యొకవారాపత్రిక యుండెను. అది వట్టి పనికిమాలినది. మంచిది మఱియొకటి లేకపోవుటచే జనులు విధిలేక దానినే తెప్పించుకొని చదువుచు వచ్చిరి. బెంజామిను కేమరు స్థాపించిన పత్రిక నడగద్రొక్కుటకు మునుపున్న యాపత్రికకు దాను స్వయముగఁ జిత్రములైన కొన్ని వ్రాతల వ్రాసిపంపుచు వచ్చెను. ఆపత్రికాధిపతివాని వ్రాతలను గనుల నద్దుకొని ప్రకటించుచువచ్చెను. అందువలన బూర్వ మెవ్వరికి నిష్టములేని యాపత్రిక జనసమ్మతమగుటయుఁ గేమరు ప్రకటించెడు పత్రిక నిరర్థకమగుటయు సంభవించెను. కేమరు పత్రికకు జందాదారులు తొంబదిమందిమాత్రమె వచ్చినందున నతఁడు తొమ్మిదిమాసములు పత్రికనడిపి యటమీఁద సాగింపలేక స్వల్పధనమునకు దానిని బెంజామినునకే విక్రయించెను. బెంజామిను దానిం గైకొని జాగ్రత్తగా నడుపఁగొలదికాలముననే వానికాపత్రిక లాభప్రదాయియయ్యెను. బెంజామిను చేతికివచ్చిన కొన్నినాళ్లలోనే యాపత్రిక జనసమ్మతమయ్యెను. చందాదారు లతఁడపేక్షించిన సంఖ్యకంటె నెక్కువగవచ్చిరి. ఆదేశ పరిపాలనము గూర్చి యొకసారి బెంజామిను పత్రికలో వ్రాసిన విషయము లాదేశపు పార్లమెంటునందున్న గొప్పవారి కందఱకు నుత్సాహము కలిగించెను. దానితో బెంజామినున కనేక గొప్పవారు మిత్రులైరి. అంతట నాపార్లమెంటువారి యచ్చుపని యంతయు బెంజామినున కియ్యఁబడెను. అది యెంతో లాభకరమైనపని. మెర్డిత్తు మొదటనుండియు సోమరియై త్రాఁగుబోతై పనిజేయక యప్రయోజకుఁడై యుండుచు వచ్చెను. ఎట్టకేలకు దైవవశమున వారిద్దఱు విడిపోయిరి. మెర్డిత్తుతండ్రి కాగితములనిమిత్తము కొంతపెట్టుబడి పెట్టనొప్పుకొని కాగితములవర్తకులు తొందఱపెట్టి యడిగినను సొమ్ము చెల్లింపఁజాలఁడయ్యెను. అందుచేత మెర్డిత్తు వ్యాపారములోఁ దనకున్న భాగము వదులుకొనఁదలంచి వ్యాపారము వలనంగలిగిన నష్టమంతయు వహించు పద్ధతి మీఁదను దండ్రి కివ్వవలసిన సొమ్మిచ్చు పద్ధతి మీఁదను దనకు ముప్పది పౌను లుచితముగా నిచ్చి తనకున్న చిన్నయప్పులఁ దీర్చుపద్ధతిమీఁదను నచ్చుకూటమంతయు బెంజామినునకు విడిచిపెట్టెను. బెంజామినువద్ద ధనములేదు. లేకపోయినను వానిమిత్రులిద్దఱు సమయమున వానినాదు

కాని యాసొమ్ము బదులిచ్చిరి. బెంజామిను షరతుల నొప్పుకొని యచ్చుకూటముఁ దన స్వాధీనము చేసికొనెను అప్పటికి వాని కిరువది నాలుగవయేఁడు. బెంజామిను చిన్న తనమునుండి మేనుదాఁచుకొనక చాల కష్టపడి యనేక పర్యాయములు భంగములు నొంది యొక్కొకసారి నిలువనీడ తినఁగూడు లేక యెన్నెన్నో సిలుగుల బడి స్వప్రయోజకత్వమువల్లనే జీవించి వేరుగా నాస్తి సంపాదింప లేకపోయిన నిరువదినాలుగవయేఁట స్వంతమైన ముద్రాయంత్రమును సంపాదించి యొకవిధముగా స్థిరజీవనోపాధి నేర్పరుచుకొనియెను. ఇంతవఱకు బెంజామిను ఫ్రాంక్లినుయొక్క చరిత్రము సవిస్తరముగా వర్ణించితిమి. ఇఁకముం దట్లు చేయక వానిగొప్పతనమును సంగ్రహముగా జెప్పుకొందము. అతఁ డారంభమునం దేసద్గుణముల జూపెనో ఁ జన్మాంతమువఱకు నట్టిగుణములనే నమ్మి వానివల్లనే వృద్ధిబొందెను !

నాగరికతగల రాజ్యములలో నాణెములు రెండువిధములుగాఁ జెల్లుచుండును. మొదటిది బంగారు వెండి రాగి మొదలగు లోహములతోఁ జేయఁబడిన నాణెము. రెండవది కాగిత నాణెము. అనగా మనము సాధారణముగా బ్యాంకినోట్లు కరెన్సీనోటులనుపేర వాడుకొనుచున్న కాగితములసొమ్ము బంగారు వెండినాణెముల కెట్లు చెల్లుబడి కలదో దొరతనమువారు సెలవిచ్చినపక్షమున నీకాగితనాణెములకు నట్టిచెల్లుబడియె యున్నది అమెరికాఖండములో నింగ్లాండులో నున్నట్లె కాగితనాణెము పెట్టుట యావశ్యమనియు నుపయుక్తమనియు బెంజామిను చిన్నపుస్తకము వ్రాసి మెడిత్తు తన్ను విడిచిన కొద్దిదినములలోనే బ్రకటించెను. ఆపుస్తక మతనికి విశేషముగా జనానురాగమును దెచ్చెను. అది చదివి యాదేశపు దొరతనమువారు కాగితనాణెమును నిర్మింపఁ దలఁచి యట్టినాణెముల నచ్చువేయుపని బెంజామినున కప్పగించిరి. అది మొదలుకొని వాని కన్నియు లాభములే కలిగెను. అచ్చుకూటమువలన వచ్చు లాభములుగాక కలములు కాగితములు మొదలగునవి నిలువఁజేసి యతఁడు విక్రయించుటచేతఁ గూడ కొంతలాభము కలుగుచువచ్చెను. ఆలాభముచేత నతఁడు ఋణముఁ దీర్చుకొని త్వరలోనె వివాహము చేసికొనెను. అప్పటికి వానిపూర్వ యజమానుఁడగు కేమరు సంపూర్ణముగఁ జెడిపోయెను భాగ్యవంతుఁడై వృద్ధుఁడై వ్యాపారము కొఱకు లక్ష్యముసేయని హాటియొక ముద్రాధికారి యాగ్రామమున నుండెను కాని బెంజామిను ఫిలడల్ఫియాలోనున్న ముద్రాయంత్రాధికారులలో నగ్రగణ్యుఁ డయ్యెను.

క్రమక్రమముగా నతఁడు గొప్పవాఁడయ్యెను. అనంతర మతండు పురజనుల కెరువిచ్చు నిమిత్త మొకపుస్తకభాండారము పెట్టెను. దానికి మొదట నేఁబదిమంది

చందాదారు లుండినను గాలక్రమమునఁ బెద్దమనుష్యు లనేకులు దానిలోఁ జేరిరి. అదియే యమెరికాఖండములో మొదట జనోపకారార్థమై స్థాపింపఁబడిన పుస్తకభాండారము. ఆభాండారమందలి పుస్తకములవలన నతఁడే ముందుగ బాగుపడెను. అతఁడు ప్రతిదినము రెండుగంట లెట్లో తీరిక చేసికొని పుస్తకములం జదివి జ్ఞానాభివృద్ధిజేసికొనుచువచ్చెను

1732 సంవత్సరమున బెంజామిను రిచర్డుసేండ్రాసను పేరుతో నొక పంచాంగముఁ బ్రకటించెను. ఇది పంచాంగమని తిథివార నక్షత్రములను జెప్పునదికాదు. స్వదేశస్థులు బాగుపడుటకుఁ గావలసిన మంచిమార్గములు నీతులు దానియందు వ్రాయఁబడుచు వచ్చెను. అది యేఁడాది కొక్కసారి ప్రకటింపఁబడు పత్రిక. ఈపత్రికనే జనులు బీదరిచార్డుపంచాంగమని చెప్పుచువచ్చిరి. ఇందు మంచి సామెతలు సారముగల వాక్యములు విశేషముగా నుండుటచే జనులు దానిని మిక్కిలి యాదరించిరి. ఇందలి మంచినీతులన్నియు వేరుగా దీసి యమెరికా ఖండము వారొక పుస్తకముఁ జేసి ప్రకటించిరి. అదియిప్పుడు సర్వజనాదరణీయముగా నున్నది. అనంతర మతఁడు క్రొత్తభాషలు కొన్ని నేర్చికొన నారంభించెను. ఆ నేర్చికొన్న విధము నతఁడీక్రింది రీతిగా జెప్పుచున్నాఁడు

‘ నేను 1733 వ సంవత్సరమున క్రొత్తభాషలు చదువ నారంభించితిని. ఆరంభించిన కొద్దికాలములోనే ఫ్రెంచిభాషలోనున్న గ్రంథముల నర్థము చేసికొనునంతటి జ్ఞానము కలిగెను. తరువాత నిటాలియను భాష నారంభించితిని. ఆభాషనే చదువుకొనుచుండినయొక పరిచితుఁడు నన్ను బలుమారు చదరంగమాడుటకు బిలుచుచువచ్చెను అందుచేత చదువు క్రింద వినియోగింప వలసిన కాలము వ్యర్థమగుచున్నదని తలంచి నేను వానితో చదరంగపు టాటకుఁ బోవుటకు కొన్ని షరతులఁ గోరితిని ఓడిపోయిన వాఁడు మరునాడు షరల మేము కలిసికొను లోపున నిటాలియను భాషాసంబంధములైన పుస్తకములలోఁ గొన్ని వాక్యములను వల్లించి యప్పగింపవలసినదని నేనుకోరితిని. మేమిద్దరము సమానముగా నాడుచు వచ్చినందున నిద్దఱిలో నెవరోడిపోయినప్పుడు వారు తప్పక నిటాలియను వ్యాకరణములోఁ గొంతభాగము మఱియొక పుస్తకములో గొంతభాగము వల్లించుచు రావలసివచ్చెను. అనంతరము నేను స్పానిషు భాష నేర్చికొని వారి పుస్తకములు సులభముగా జదువగలిగితిని, చిన్ననాడు నేనొక సంవత్సరము పాఠశాలలో లాటిను భాష చదువుకొంటిని గాని దాని నిటీవలయశ్రద్ధ చేసి

విడిచితిని. పైమూడు భాషలు నేర్చికొన్న పిదప నే నొకనాడు లాటిను భాషలో నున్న పత్రమొకటి చదువుచుండ నది నాకెంతో సులభముగ నర్థమయ్యెను, ఆభాషలో నే నసుకొన్న దానికంటె నాకెక్కువ పాండిత్యమే యుండెను అది మొదలా భాషలో మఱింత కృషిచేసితిని పైమూడు భాషలు వచ్చుటచే నాకిది సులభమయ్యెను."

1736 సంవత్సరమున బెంజామిను జనరల్ యెస్సెంబ్లీయని పిలువంబడు తన దేశము పార్లమెంటులో గుమస్తాగా నేర్పఱుపఁబడెను అనంతరమతఁడు టపాపనివాండ్ర మీఁ దనధికారి యయ్యెను. అధికారియై యది మొదలతఁడు లౌకిక వ్యవహారములలో బ్రవేశించెను. అతఁడు మొదట నగరసంరక్షణమును గూర్చిచాల పనిచేసెను, తరువాత నతఁడు తనదేశములో నగ్ని భయములవలన భంగమొందు గృహముల సంరక్షణనిమిత్తము భీమాసంఘము పెట్టించెను. పిమ్మట నతఁడు తత్వజ్ఞానసంఘము స్థాపించి విద్యార్థుల యభివృద్ధినిమిత్తము సమాజము లేర్పరచి దేశరక్షణము నిమిత్తము సైన్యము నేర్పాటుచేసెను వేయేల. ప్రభుత్వమునం దున్న ప్రతిడిపార్టుమెంటులోను బెంజామిను పనికలుగఁ జేసికొని దేశాభివృద్ధినిమిత్తము పాటుపడెను. ఫిలడల్ఫియా నగరపు మునిసిపాలిటీలో నతఁడు కమీషనరుగా జేరెను తరువాత నందులో నతఁడు పెద్ద యయ్యెను. అయిన కొన్నాళ్లకు పురజనులు దేశపు పార్లమెంటుకు వానిని తమ ప్రతినిధిగా నెన్నుకొని పంపిరి. ఇట్లు ప్రతినిధియగుట నతనికెంతో యిష్టముగా నుండెను. ఏలయన నింతకుముం దతఁ డాసభలో గుమాస్తాగా గొంతకాల ముండినందున గుమాస్తాలకు మాటలాడు నధికారము లేకపోవుటచే దేశస్థితిఁగూర్చి యెట్టి చర్చలు జరుగుచున్నను నోరెత్తజాలక వినిగి బొమ్మలు వ్రాసికొనుచు గూర్చుండుచువచ్చెను. ఇప్పు డాపార్లమెంటులోఁ దాను సభికుఁడే యగుటచేత దేశమునకుఁ జేతనైన యుపకారముఁ జేయుట కవకాశము గలిగినదని యతఁడు సంతసించెను. ఈయభివృద్ధులవల్ల యతఁడు మిక్కిలి యుబ్బిపోయెను. ఏలయన నతఁడు మొదట మిక్కిలి తక్కువవాఁడై పొట్టపోసికొనుటయే కష్టముగా నుండునట్టులు జీవించి యెట్టకేలకు తనదేశీయ మహాసభలో బ్రతినిధియై కూర్చుండెనుగదా! మెండియు నయోచితముగ జనులు తనయందు విశేష గౌరవము గలిగి వారివిశ్వాసమునకుఁ బాత్రుని జేసి మెచ్చుటచే వాని యానందము మితిమీరెను. ఈలౌకిక వ్యవహార సంబంధములచేత నతనికి లోకమున గలిగిన కీర్తికంటె మఱికొన్ని విషయముల నతనికెక్కువ కీర్తిగలిగెను. ప్రపంచమునం దనే

టి పురుషులలో నతఁ డగ్రగణ్యుఁడై యెల్లవారికిం దెలిసినవాఁడై శ్లాఘ్యుఁడయుండెను. స్వదేశమునకు జేసిన యుపకారములకేమిగాని లోకమునకంతకు మిను చేసిన మహోపకార మింకొకటికలదు. ఏశక్తి క్షణములో వేలకొలఁది మైదూరము వార్తలను దీసికొనపోఁగలదో ఏశక్తి నాగరికతగల దేశములలో మనుష్యు చేయునట్టి పనులెల్ల దానె చేయుచున్నదో యట్టి విద్యుచ్ఛక్తి (అనఁగా ఎ సిటీ) మొట్టమొదట బెంజామిను కనిపెట్టెను. అతఁడొకనాఁడు గాలిపడగ నెగయుచుండఁగా నట్టి యద్భుతశక్తి ప్రకృతిలో నున్నట్లు వానికిం బొడకట్టెను. గట్టుటయు నతఁడు దానింగూర్చి యనేక శోధనలు ప్రయత్నములుఁ జేసి ద గృతకృత్యుఁడయ్యెను.

మొట్టమొదట నతఁ డది కనిపెట్టి దానింగూర్చి యొకయుపన్యాసము వ్రాసి ప్రకటించెను ఇంగ్లాండులోనున్న ప్రకృతిశాస్త్రజ్ఞులు దానిం జదివి తొలుదొల్త పరిహసించిరి. కాని ఫ్రాన్సుదేశమందు బెంజామినువలెనే ప్రకృతిరహస్యములను కనిపెట్టుటకు ప్రయత్నించుచుండిన బఫన్ దానినిం జదివి ఫ్రెంచిలోనికి భాషాంతరీకరించెను. ఆభాషలోనుండి యది యూరపుఖండమునందున్న యన్నిభాషలలోనికిఁ దర్జుమా చేయఁబడెను. ఇంగ్లాండులో బెంజామిను వ్రాతలయొక్క యాథార్థ్యము కాలక్రమమునఁ బ్రకృతిశాస్త్రపండితులకు గోచరమగుటచే మున్ను బరిహసించినవారే యప్పుడాదరింపసాగిరి. ఆదరించుటయేగాక నింగ్లాండులోనున్న ప్రకృతిశాస్త్రసంఘము వారు వానిధరఖాస్తు లేకయే వానినిఁ దమసంఘములోఁ జేర్చుకొని ప్రతిసభికుఁడేఁటేఁట నీయవలసిన చందా నతఁ డీయనక్కరలేదని తీర్మానించి యాసంఘము పక్షమున బ్రకటింపఁబడు పుస్తకములన్నియు వానికి నుచితముగా నీయసాగిరి. అదియునుగాక యాసంవత్సర మాసంఘమువారు వానికొక బంగారుపతకము బహుమానము చేసిరి.

అతఁడు 1753 వ సంవత్సరమున నింగ్లాండునకుఁ బోయినప్పుడు యూరపుఖండములోనుండిన విద్వజ్జనసంఘములన్నియు వానిని సభికునిగా జేర్చికొనియెను. మొట్టమొదట నక్షరముల కూర్పరికాఁడై మిక్కిలి నీచదశలోనుండి స్వయంకృషిసహజపాండిత్యముగాక యన్యసాధనములవల్ల విద్య నేర్చికొనక విద్వాంసుఁడైన యీబెంజామిను ప్రపంచమునం దానాటి ప్రకృతిశాస్త్రపండితులలో నెవ్వరుబసయని గౌరవము నుబడసెను. బెంజామినుయొక్క తరువాతిచరిత్రము మిక్కిలి గొప్పది. అతఁడు రాజనీతివిశారదుఁడై మహాదేశాభిమానియై పరరాజులతో నొడంబడికలు చేయుటయు

క్రియలు విచారణచేయుటయు తత్వశాస్త్రజ్ఞులతోఁ బ్రసంగములు చేయుట
వలగు మహాకార్యములతో శేషకాలము గడపెను. అమెరికాఖండములో
భాగ మదివఱకు నింగ్లాండురాజు పరిపాలనములో నుండెను 1775వ సంవత్సర
ంతమున నింగ్లీషువారి పరిపాలనకు లోఁబడిన యమెరికాఖండస్థులలోఁ గొందఱు
పరిపాలనమునకు లోఁబడక తాము స్వతంత్రరాజ్యము సంస్థాపించుకొనవలెనని
మగు నింగ్లాండుమీఁద తిరుగుబాటుచేసి బెంజామిను ఫ్రాన్క్లినుగూడ తన
కు స్వాతంత్ర్యమే గోరినవాఁడు గావున దానుగూడ గత్తి కట్టి యింగ్లీషువారి
రి దేశస్థులుబంప ఫ్రాన్సుదేశపురాజుపద్దకుఁబోయి యాతనితోఁ దనదేశపక్ష
ంధిఁ జేసికొనెను. 1783 వ సంవత్సరమున నింగ్లాండురాజు తనతో విరోధిం
నమెరికాఖండస్థులను గెలువలేక వారిదేశము స్వతంత్రదేశముగా నంగీకరించి
తన సమ్మతి తెలియునట్లొక పత్రమువ్రాసి యిచ్చెను. అందులో బెంజామిను వ్రాలు
చేసెను తరువాత రెండుసంవత్సరముల కతఁడు తనజన్మస్థానమగు బోస్టనునకుబోవ
వచ్చటిజనులు వాని నెంతో గౌరవించిరి. ఈమహాత్ముఁడు లోకోపకారకమైన తన
జీవితమునిట్లుగడపి 179 సం॥రం 17 వ యేప్రియల్ తారీఖున కాలధర్మము నొందెను.

ఈతనిచరిత్రమునుండి మన మెన్నోనీతులు నేర్చుకొనవచ్చును. కాల మెంతో
విలువగలదనియు నిష్ప్రయోజనమైన వ్యర్థముగా గడపక మనుష్యుఁడేదో పని చేయుచుం
డవలయుననియుఁ దీరికయున్నపుడెల్ల జ్ఞానము సంపాదించుకొనుచుండవలయు ననియు
మిక్కిలి పొదుపుతో జీవించినపక్షమున నెంతచిన్నజీతగాఁడైన సుఖముగాఁ గాలక్షేప
ము చేయవచ్చుననియు నీతిగలిగి మేను దాఁచుకొనక పనిఁజేయువాఁడు మొదట
నెంతనీచదశలోనున్నను గొప్పవాఁడు కావచ్చుననియు మనము గ్రహింపవలసియున్నది
బెంజామినుయొక్క విద్యాసక్తి నందఱుఁ జూచి నేర్చుకొనవలసినదిగదా పొట్టయైన
గట్టిపెట్టుకొని యతఁడు పుస్తకములనద్దెయిచ్చి తెచ్చి చదువుచుండునుగదా! తీఱుబడి
లేదనువారు మాటలలో నాటలలోఁ గాలము గడుపువారు బెంజామినుయొక్క చరి
త్రము చదివి సిగ్గుపడి తమ చిరమిత్రమైన సోమరితనమును విడిచి కుబుసమువిడిచిన
త్రాఁచులవలె చురుకుదనముఁగలిగి వర్తింతురుగాక! చదువవలెనని మనసున్న పక్షమున
ప్రతివానికి తీరుబడి దొరకును. అతనివంటి బుద్ధివిశేషము ప్రతివానికి నుండకపోవ
చ్చును. కాని యతనిపట్టుదల చాకచక్యము శ్రద్ధ లోకు లనుసరింపఁదగినవే. నక్క
యెక్కడ దేవలోక మెక్కడ యన్నట్లు కొవ్వొత్తులు చేసికొను బాలుఁడెక్కడ
రాజాధిరాజులచేత సన్మానింపఁబడిన దేశాభిమానియై స్వదేశము నుద్ధరించుటయెక్కడ?
పరిశ్రమవంటిది మఱియొకటి లేదు. పరిశ్రమఁజేసినచో ప్రతివస్తువు మనకు గరతలామ
లకమగును. పరిశ్రమ మిహపరసాధనము.

స మా ప్త ము.